https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సారథ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ సంపుటి : 17 సంచిక : 308 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ బుధవారం, సెప్టెంబర్,9, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-




## మేడ్చల్‌లో తీవ్ర ఉద్రిక్తత

### కేటీఆర్, హరీష్ రావు సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్ట్



**హైదరాబాద్,సెప్టెంబర్,08**మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతుగా, ఆయనకు రక్షణగా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌కు బయలుదేరిన బీఆర్ఎస్ ముఖ్య నేతలను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులతో పాటు పలువురు పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఉన్నారు.పోలీసులతో తీవ్ర వాగ్వాదం..నేతలను అడ్డుకోవడంతో మేడ్చల్ వద్ద పరిస్థితి ఒక్కసారిగా వేడెక్కింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా వెళ్తున్న తమను ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నిస్తూ తీవ్ర వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య తోపులాట జరగడంతో వాతావరణం మరింత ఉద్రిక్తంగా మారింది. బీఆర్ఎస్ నాయకులు పోలీసులతో దురుసుగా ప్రవర్తించారని, ప్రభుత్వ ఆదేశాల మేరకే తమ విధులను నిర్వహిస్తున్నామని పోలీసులు స్పష్టం చేశారు. కేసీఆర్ వద్దకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతల యత్నాన్ని భగ్నం చేసిన పోలీసులు, కేటీఆర్, హరీష్ రావు సహా ప్రజాప్రతినిధులందరినీ అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన నేతలను భద్రతా కారణాల దృష్ట్యా సమీపంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించే అవకాశం ఉందని తెలుస్తోంది. ముందస్తు జాగ్రత్త చర్యగా మేడ్చల్ పరిసర ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనతో తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా కలకలం రేగింది.

## చర్యలు తీసుకుంటాం"..

### స్పీకర్‌ను పరామర్శించిన సీఎం, డిప్యూటీ సీఎం..



**హైదరాబాద్,సెప్టెంబర్,08:** తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో చోటుచేసుకున్న పరిణామాలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనంగా మారాయి. అసెంబ్లీ ముట్టడి, అధికారులపై దాడులు, స్పీకర్ పట్ల బీఆర్ఎస్ నేతల ప్రవర్తనపై ప్రజాప్రతినిధులు, ప్రజల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో మంగళవారం అసెంబ్లీకి రాగానే స్పీకర్ ఛాంబర్‌కు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆయనను పరామర్శించారు. ఇక, సోమవారం అసెంబ్లీ తొలిరోజే బీఆర్ఎస్ నాయకులు చేపట్టిన నిరసన తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. శాసనసభ ప్రాంగణంలో విధుల్లో ఉన్న అధికారులపై బీఆర్ఎస్ నేతలు భౌతిక దాడులకు దిగడమే కాకుండా, మహిళా అధికారుల ముందే చొక్కాలు విప్పుకొని అసభ్యకరంగా ప్రవర్తించడం సభ్యసమాజం తలదించుకునేలా చేసింది. ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభమైన స్పీకర్ స్థానంలో ఉన్న గడ్డం ప్రసాద్‌ను బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు తీవ్ర అభ్యంతరకర పదజాలంతో దూషించారని పాలకపక్షం మండిపడింది. అసెంబ్లీ ఎదుట జరిగిన ఈ దురదృష్టకర పరిణామాలపై పత్రికలు, టీవీలు, అన్ని మీడియాలు ప్రముఖంగా ప్రచురించాయి. ఈ వ్యాఖ్యలతో తీవ్ర మనస్తాపానికి గురైన స్పీకర్ గడ్డం ప్రసాద్ సభలోనే కంటతడి పెట్టుకున్నారు.అసెంబ్లీ చరిత్రలోనే ఇదొక బ్లాక్ డేగా మారుతుందని, స్పీకర్‌ను అవమానించడం అంటే మొత్తం తెలంగాణ సమాజాన్ని, దళిత వర్గాలను అవమానించడమేనని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ భావోద్వేగానికి గురైన దృశ్యాలు చూసి తీవ్ర ఆవేదన చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆయనకు తమ పూర్తి మద్దతు తెలిపారు. రాజ్యాంగబద్ధమైన స్పీకర్ పదవికి భంగం కలిగించేలా వ్యవహరించిన ఎంతటి వారికైనా సరే ప్రభుత్వం చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని, ప్రభుత్వం ఆయనకు అండగా నిలుస్తుందని స్పీకర్‌కి సీఎం హామీ ఇచ్చారు.

## స్పీకర్‌ను బెదిరించే హక్కు హరీశ్‌రావుకు ఎవరిచ్చారు?: శ్రీధర్ బాబు



**హైదరాబాద్,సెప్టెంబర్,08:**అసెంబ్లీ స్పీకర్ స్థానాన్ని ఉద్దేశించి హరీశ్‌రావు బెదిరింపు ధోరణిలో మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమాదకరమని రాష్ట్ర శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీని ఏ రకంగా నడపాలనే దానిపై స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వడానికి, "ఇలా చేయొద్దు.. అలా చేయొద్దు" అని శాసించడానికి ప్రతిపక్ష నేతలెవరని సూటిగా నిలదీశారు. రాజ్యాంగబద్ధమైన స్థానంలో ఉన్న స్పీకర్‌ను బెదిరించేలా వ్యవహరించడం సభా సంప్రదాయాలకే విరుద్ధమని స్పష్టం చేశారు. స్పీకర్‌పై జరిగిన దూషణల వ్యవహారంలో సదరు నేతలు ఏం మాట్లాడారో వీడియో ఫుటేజీల్లో అత్యంత స్పష్టంగా రికార్డై కనిపిస్తోందని తేల్చిచెప్పారు.మహిళా ప్రజాప్రతినిధులపై జరిగిన సంఘటనలను ప్రభుత్వం, స్పీకర్ పక్కన పెట్టేస్తున్నారన్న బీఆర్ఎస్ విమర్శలను శ్రీధర్ బాబు పూర్తిగా కొట్టిపారేశారు. మహిళా ఎమ్మెల్యేల అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని శాసనసభాపతి స్వయంగా ఆదేశాలు జారీ చేశారని వెల్లడించారు. అయితే మహిళా ఎమ్మెల్యేల అంశాన్ని చూపిస్తూ, అదే సమయంలో స్పీకర్‌ను నేరుగా అవమానించిన అత్యంత తీవ్రమైన పరిణామాన్ని అసలు పట్టించుకోవద్దని ప్రతిపక్ష నేతలు మాట్లాడటం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అత్యున్నతమైన స్పీకర్ వ్యవస్థపై దాడి జరిగిన వ్యవహారాన్ని పక్కన పెట్టాలని కోరడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, చట్టసభ నిబంధనలకు కట్టుబడి బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మహిళల ముందు హరీశ్ రావు బట్టలు విప్పుతారా?: సీతక్క ఫైర్



**హైదరాబాద్,సెప్టెంబర్,08:**శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అత్యంత హేయమైన, అనుచిత వ్యాఖ్యలు చేసి, ఇప్పుడు ఏమీ ఎరుగనట్లు తప్పించుకోవాలని చూస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీలో ఆమె మాట్లాడుతూ... బీఆర్ఎస్ నేతల తీరును ఎండగడుతూ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. "సభలో దళిత వర్గానికి చెందిన స్పీకర్ స్థానానికి గౌరవం ఇవ్వకపోగా, గతంలో ఎప్పుడో మరణించిన ఆయన మాతృమూర్తిని ఉద్దేశించి అంత నికృష్టమైన భాష మాట్లాడటం ఏ రకమైన సంస్కారం?" అని నిలదీస్తూ కంటతడి పెట్టారు. సీతక్క ఆవేదన చూసి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కూడా సభలోనే కన్నీళ్లు పెట్టుకోవడంతో వాతావరణం అత్యంత గంభీరంగా మారింది. సభలో ప్రతిపక్ష నేతల తీరుపై మండిపడ్డ సీతక్క... "సబితా ఇంద్రారెడ్డిని నిజంగా తోసింది ఎవరో విజువల్స్ చూస్తే తెలుస్తుంది. మహిళా ఎమ్మెల్యేలను ముందు పెట్టుకుని రావడం ఏంటి? హరీశ్ రావు మహిళల ముందు బట్టలు విప్పుతారా?" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. "మహిళా ప్రజాప్రతినిధులను సురక్షిత ప్రాంతానికి పంపి, ఆ తర్వాత పురుష నేతలు నిరసనకు రావడం పద్ధతి. కానీ మహిళలను అడ్డుగా పెట్టుకుని రాజకీయం చేయడం దారుణం" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో ఉన్న మహిళా పోలీస్ అధికారులపై బీఆర్ఎస్ నేతలు చేయిచేసుకుని, దుర్భాషలాడిన దృశ్యాలు రికార్డయ్యాయని, చట్టాన్ని ఉల్లంఘించి పోలీసులను కొట్టిన ఎమ్మెల్యేలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చట్టసభలు దేవాలయం లాంటివని, బీఆర్ఎస్ మహిళా నేతలు ఈ విషయంలో ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.


## బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ అరెస్ట్

### నోటీసులు ఇవ్వకుండానే అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ శ్రేణుల ఆగ్రహం



**హైదరాబాద్,సెప్టెంబర్,08:**శాసనసభ సమావేశాల వేళ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధుల అరెస్టులు తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపుతున్నాయి. తాతా మధు తదితర నేతలను అరెస్ట్ చేసిన పోలీసులు... బీఆర్ఎస్ మన్నె క్రిశాంక్ ను కూడా అరెస్ట్ చేశారు. క్రిశాంక్ నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు కార్ఖానా పోలీస్ స్టేషన్ కు తరలించారు. క్రిశాంక్ కు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై మాట్లాడుతున్నందునే బీఆర్ఎస్ నేతలను అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

## 'టెట్' లేకుండా టీచర్లను నియమించొద్దు: సుప్రీంకోర్టు



ఢిల్లీ: అర్హత లేని టీచర్లతో విద్యార్థుల భవిష్యత్తు నాశనం అవుతుందని, 'టెట్' లాంటి నిర్దేశిత అర్హతలు లేని ఉపాధ్యాయులను నియమించొద్దని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం పేర్కొంది. అర్హత లేని టీచర్ల నియామకంపై స్టే విధిస్తూ సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలిచ్చింది. అస్సాం టీచర్ రిక్రూట్మెంట్ కేసులో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. టీచర్ల రిక్రూట్మెంట్‌పై సమీక్ష చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

## బీఆర్ఎస్ మహిళా నేతలపై దాడి చేయించింది రేవంత్ రెడ్డే: కేటీఆర్



హైదరాబాద్, సెప్టెంబర్ 8: శాసనసభలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు జరిగిన అవమానంపై కచ్చితంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈరోజు(మంగళవారం) అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. 420, 1000 రోజుల పరిపాలనతో పాటు అన్ని విషయాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. అవన్నీ చర్చకు రాకుండా తప్పించుకోవడానికే చిల్లర డ్రామాలు, చిల్లర వేషాలు తప్ప ఇంకేమీ కాదంటూ దుయ్యబట్టారు. ప్రజలందరూ గమనిస్తున్నారని.. అన్నీ అర్థం చేసుకుంటారని తెలిపారు. తప్పకుండా ఈరోజు శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి స్పష్టం చేశారు. అన్ని విషయాల్లోనూ సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేస్తామన్నారు. ఇతర ఎమ్మెల్యేల విషయంలో, ఎమ్మెల్సీల విషయంలో శాసనమండలిలో చర్చ జరగాలని తెలిపారు. ముఖ్యమంత్రి బెదిరింపులకు, భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరని చెప్పారు. మా మహిళా నేతలపై దాడి చేయించింది రేవంత్ రెడ్డి అంటూ కేటీఆర్ ఆరోపణలు గుప్పించారు. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఏం జరిగినా పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. కేసీఆర్ ఇంటిని టచ్ చేస్తే రాష్ట్రం అగ్నిగుండంలా మారుతుందన్న ఆయన.. పోలీసులే దగ్గరుండి కాంగ్రెస్ గుండాలని పంపుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ ఇంటి ముట్టికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన పిలుపుపై కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ ఇంటి ముట్టడికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన పిలుపుతో యాదాద్రిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. కేసీఆర్ ఇంటిని ముట్టడించేందుకు వెళుతున్న కాంగ్రెస్ నేతల్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట జరిగింది. వెళ్తున్నారనే సమాచారంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అప్రమత్తమయ్యారు. అసెంబ్లీ నుంచి ఎర్రవల్లికి బయల్దేరారు. ఈ క్రమంలో కేసీఆర్‌కు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బొల్లారం వద్ద భారీ ఎత్తున మోహరించిన పోలీసులు వారిని అడ్డుకున్నారు. బొల్లారం చౌరస్తా నుండి ఎరవెల్లి వైపు రోడ్డుపై కేటీఆర్ హరీష్ రావు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నడుచుకుంటూ వెళ్లారు.

## ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

### తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నిరసన




**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (డీకే చాటింపు)**

మంగళవారం మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ ప్రధాన కార్యాలయంలో ఉద్యోగుల డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ (టీఈజీజేఏసీ) విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా ౧+రాం అధ్యక్షులు కృష్ణాయాదవ్ మాట్లాడుతూ, ఈ నెల 10వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలని సంఘం నాయకులు గండూరి వెంకట్, నాగులపల్లి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. అందుకోసం అన్నిశాఖల ఉద్యోగులతో సన్నాహాక సమావేశాలు, నిరసనలు చేపడు తున్నట్లు తెలిపారు. మండల, డివిజన్, జిల్లా కేంద్ర కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో ఈ నిరసనలు రాష్ట్రమంతటా నిర్వహిస్తున్నట్లు టీఈజీజేఏసీ ప్రకటించింది. ప్రధానంగా పి.ఆర్.సి., పెండింగ్ డి.ఎ.లు, పదోన్నతులు, హెచ్.ఓ.డి. కార్యాలయాలలో 12.5 శాతం కోటా, మొదలగునవి వెంటనే పరిష్కరించాలని సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో TNGOs Hyd సెంట్రల్ యూనియన్ నుండి వెంకట్, TEGJAC Member & I&PR ఫోరం అధ్యక్షులు నాగులపల్లి వెంకటేశ్వర రావు, TGOs ఫోరం జాయింట్ సెక్రటరీ వనజ, TNGOs I&PR ఫోరం అధ్యక్షులు జితేందర్, తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరుపు కోవాలి

# శాంతి కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ , కమిషనర్

**- అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు**

**- డీ.జే లపై నిషేధం అమలు**





**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 8 (డీకే చాటింపు)**గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ ఘనంగా జరుపుకోవాలని పి. సాయి చైతన్య సూచించారు. వినాయకచతుర్థిఉత్సవాలను పురస్కరించుకుని సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం శాంతి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, అదనపు కలెక్టర్ భుజంగరావు సంబంధిత అధికారులకు కీలక సూచనలు చేశారు. గణేష్ ఉత్సవాలు , జెండా బాలాజీ జాతర సందర్భంగా చేపట్టాల్సిన చర్యలు , అందుబాటులోకి తేవాల్సిన సదుపాయాల గురించి సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు , శాంతి కమిటీ సభ్యులు , ముస్లిం మత పెద్దలు , మండపాల నిర్వాహకులు పలు ప్రతిపాదనలు చేస్తూ తమ అభిప్రాయాలను వెల్లడించారు. శాంతియుత వాతావరణంలో , భక్తి శ్రద్ధలతో మతసామరస్యానికి ప్రతీకగా వేడుకలు జరిగేలా కృషి చేస్తామని అన్నారు. రోడ్ల మరమ్మతులు , శోభాయాత్రకు అడ్డంకిగా ఉండే చెట్ల కొమ్మలను తొలగించడం వంటి పనులను యుద్ధ ప్రాతిపదికనచేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో సహృద్భావ వాతావరణంలో ఈ వేడుకలుజరుగుతాయని , ఈసారి కూడా అదే స్ఫూర్తిని ప్రదర్శిస్తూ గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలని , జిల్లా ప్రతిష్టను పెంపొందించాలని అన్నారు. మండపాల ఏర్పాటులో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరు కూడా విద్యుదాఘాతం బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మంటపాల వివరాలను ట్రాన్స్ కో అధికారులకు తెలియజేసి , ఆ శాఖ సిబ్బంది ద్వారానే విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు. ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడకుండా , ప్రజలకు అసౌకర్యం కలుగకుండా వినాయక మంటపాలు ప్రతిష్టించాలని సూచించారు. 8 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలను మాత్రమే బాసర గోదావరిలో నిమజ్జనానికి అనుమతిస్తామని , అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఉమ్మెడ వద్ద నిమజ్జనం చేయాలని సూచించారు. మండపాల వద్ద భక్తి పాటలు , భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసేలా నిర్వాహకులు కృషి చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు మట్టి విగ్రహాలను ప్రతిష్టించేలా యువతను ప్రోత్సహిస్తూ పర్యావరణ హితానికి పాటుపడాలని హితవు పలికారు. సమస్యాత్మక ప్రాంతాలు , ప్రార్థనాలయాల వద్ద సి.సి కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ సాయిచైతన్య తెలిపారు. నిమజ్జనోత్సవం సందర్భంగా ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు విగ్రహాలు నిమజ్జనం చేసే ప్రక్రియను ఆద్యంతం అధికారులు పర్యవేక్షణ జరపాలని , గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతూ క్రేన్, లైటింగ్ వ్యవస్థ, అత్యవసర వైద్యం, అంబులెన్స్, తాగునీరు, బారికేడింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుధ్యం వంటి చర్యలు ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను



అదనపు కలెక్టర్ భుజంగరావు ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో శోభాయాత్రలో పాల్గొనే వాహనాల్లో ఎటువంటి యాంత్రిక సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని , నిమజ్జన యాత్ర కొనసాగే ప్రాంతాలలో రోడ్లకు ఇరువైపులా కిందికి వేలాడే కరెంటు తీగలు, వంగి ఉన్న చెట్ల కొమ్మలు వంటివి ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తొలగించాలని, ప్యాచ్ వర్క్ చేపట్టి రోడ్లపై ఏర్పడిన గుంతలను మూసివేయాలని అన్నారు. అగ్నిమాపక శాఖ అధికారులు , సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని అవగాహన కల్పిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన గోడ ప్రతులను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు , నగర మేయర్ ఉమారాణి, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్ర కుమార్, విజయ కుమారి, ఏసీపీలు ప్రకాష్ , వెంకటేశ్వర్ రెడ్డి , శ్రీనివాస్, మస్తాన్ అలీ , వివిధ శాఖల అధికారులు, సార్వజనిక్ గణేష్ మండలి ప్రతినిధులు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తెలంగాణ పిసిసి అధ్యక్షులు బొమ్మన మహేష్ కుమార్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపిన

**- రంగా రెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు**



**హైదరాబాద్, సెప్టెంబర్ 8 (డీకే చాటింపు)** తెలంగాణ కాంగ్రెస్పార్టీ అధ్యక్షులుగా విజయవంతంగా...రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా. బొమ్మన మహేష్ కుమార్ గౌడ్ ని సోమవారం నాడు ఆయన కార్యాలయంలో...రంగా రెడ్డి జిల్లా కాంగ్రెస్పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు శుభాకాంక్షలు తెలియజేశారు

## ఖబర్దార్ రేవంత్ రెడ్డి.. హౌస్ అరెస్టులతో ప్రజల తరఫున చేసే మా పోరాటాన్ని ఆపలేరు

**- భవాని ప్రవీణ్ కుమార్**



**ఎల్బీనగర్ సెప్టెంబర్ 8 (డీకే చాటింపు)** తెల్లవారుజామున 4 గంటలకే పోలీసులను పంపి ఇల్లు ముట్టడించి మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ గారిని అక్రమంగా హౌస్ అరెస్ట్ చేసిన రేవంత్ సర్కార్! హామీలు నెరవేర్చడం చేతకాక.. పోలీసులను ముందేసి భయపెట్టాలని చూస్తే భయపడేది లేదు! ఎమ్మెల్యేలపై దాడులు, నాయకుల హౌస్ అరెస్టులు మీ పిరికిపంద పాలనకు నిదర్శనం! ప్రశ్నించే గొంతును నొక్కలేరు.. 420 హామీల లెక్క తేల్చే వరకు వదిలేది లేదని హెచ్చరించారు.!

# అక్షరాస్యతతోనే సాధికారత

**-ప్రతి ఒక్కరూ అక్షరాస్యులు కావాలి... -నారాయణపేట జిల్లాలో అక్షరాస్యత శాతం 49.93 శాతం... -పురుషుల అక్షరాస్యత 60.32 శాతం...**

**-మహిళల అక్షరాస్యత 39.72 శాతం... -అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా అక్షరాస్యత ర్యాలీని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ప్రియాంక...**





**నారాయణపేట,(డీకే చాటింపు):** అక్షరాస్యత అనేది కేవలం చదవడం,రాయడం మాత్రమే కాదని,అది వ్యక్తి జీవితాన్ని మార్చే శక్తి అని జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన అక్షరాస్యత ర్యాలీని జిల్లా కలెక్టర్ ప్రియాంక ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ సత్య నారాయణ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువు మనిషికి జ్ఞానం, ఆత్మవిశ్వాసం, స్వావలంబనను అందిస్తుందని తెలిపారు. నారాయణపేట జిల్లాలో అక్షరాస్యత శాతం 49.93 శాతం మాత్రమే ఉందని, పురుషుల అక్షరాస్యత 60.32 శాతం కాగా, మహిళల అక్షరాస్యత 39.72 శాతంగా ఉందని కలెక్టర్ తెలిపారు. మహిళల అక్షరాస్యతలో ఉన్న అంతరాన్ని తగ్గించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అన్నారు. మహిళాసంఘాలు, స్వయం సహాయక సంఘాల సహకారంతో మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రస్తుతం అమలులో ఉన్న ఉల్లాస్ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను గుర్తించి, వారికి చదవడం,రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. గుర్తించిన అభ్యాసకులందరినీ సెప్టెంబర్‌లో నిర్వహించనున్న ఎఫ్ఎల్ ఎన్ ఏ టి,ఎన్ఐవోఎస్ పరీక్షకు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు, విద్యాశాఖ,గ్రామీణాభివృద్ధి శాఖ, స్వయం సహాయక సంఘాలు,వాలంటీర్లు, ప్రజలు సమన్వయంతో పనిచేసి అక్షరాస్యత లక్ష్యాలను సాధించాలని సూచించారు. "ప్రతి ఒక్కరు చదువుకోవాలి..ప్రతి మహిళ అక్షరాస్యురాలు కావాలి.. ప్రతి గ్రామం సంపూర్ణ అక్షరాస్యత వైపు అడుగులు వేయాలి. చదువు ఉంటేనే అభివృద్ధి–అక్షరాస్యత ఉంటేనే సాధికారత" అని కలెక్టర్ పేర్కొన్నారు. నారాయణపేట జిల్లాను అక్షరాస్యతలో ముందంజలో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములై సమిష్టిగా కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి గోవిందరాజు, డీఆర్డీవో వెంకట్రాములు,డీపీ ఆర్ వో రషీద్,మున్సిపల్ కమిషనర్ శంకర్,ఎంఈవో బాలాజీ,ఉల్లాస్ ప్రోగ్రాం జిల్లా కోఆర్డినేటర్ రఘునాథ్, శివకుమార్,ఏపీఎం నారాయణ,వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు,కళాకారులు పాల్గొన్నారు.

# ఎల్బీనగర్ మహిళల ఆగ్రహం --- కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార ధోరణికి నిరసన

**- మాజీ కార్పొరేటర్ రమావత్ పద్మ శ్రీనునాయక్**





**ఎల్బీనగర్ సెప్టెంబర్ 8 (డీకే చాటింపు)** ప్రజా పాలన, ప్రజా పాలన అంటూ ప్రజా వ్యవస్థనే కూని చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అహంకారపూరిత ధోరణి నశించాలని డిమాండ్ చేస్తూ నిన్న అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలను చూడకుండా జుట్టు పట్టుకొని తోసి వేస్తూ జరిగిన సంఘటనను గుర్తు చేస్తూ ఎల్బీనగర్ మహిళల ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అందులో భాగంగానే ఒక ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి కేవలం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరుని అనుకరించి వారికి కనుసైగలలోని గౌరవ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గారి పై వీర్లపల్లి శంకరయ్య చేసిన అనుచిత వ్యాఖ్యలపై గాను ఆధ్వర్యంలో వీర్లపల్లి శంకరయ్య దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ, ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎల్బీనగర్ మహిళలు తీవ్రంగా ఖండించారు. "420 హామీలతో ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వాన్ని గద్దె దించడానికి మహిళలే చాలు" అని ఎల్బీనగర్ మహిళలు మరోసారి నిరూపించారు. ఎవరి ప్రోద్బలంతో కాకుండా స్వచ్ఛందంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళలు, నిన్న మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తూ పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని, తాము ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడమే కాకుండా ప్రజల మనోభావాలను గౌరవిస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగించాలని ఎల్బీనగర్ మహిళలు డిమాండ్ చేశారు. అనంతరం ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ కు మహిళలు ర్యాలీగా వెళ్లి ఏసిపి గారికి మరియు సిఐ గారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం మాజీ కార్పొరేటర్ పద్మనాయక్,మల్లీశ్వరిరెడ్డి,రంగేశ్వరి నాయుడు,శైలజ,రమాదేవి,విజయ,అంజలి,లత,దేవి,మమత,శిల్పరెడ్డి,వాణి,సూరజ్ ఎస్దాని,కల్పన,లక్ష్మి,పార్వతి,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఉపాధ్యాయుడికి గుర్తింపే నిజమైన గురుదక్షిణ

**-ట్రస్మా జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి...**

**-నారాయణపేట డిఈఓకు సత్కారం...**



**నారాయణపేట,(డీకే చాటింపు):** ప్రతి ఉపాధ్యాయుడికి సరైన గుర్తింపు నిజమైన గురుదక్షిణ అని ట్రస్మా జిల్లా అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నారాయణపేట డిఈఓ డాక్టర్ గోవిందరాజుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందించడం పట్ల ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు. మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ట్రస్మా సభ్యులు డిఈఓను శాలువాతో సత్కరించి మిఠాయిలు తినిపిస్తూ మొక్కను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మహబూబ్ నగర్ బీఈడీ కళాశాలలో ఎంతోమంది ఉపాధ్యాయులను తయారు చేసిన గొప్ప గురువుగా గోవిందరాజును అభినందించారు. ఉమ్మడి జిల్లాలో డిప్యూటీ ఈవో, డీఈవోగా పనిచేసి విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు చక్కటి మార్గనిర్దేశం చేశారని కొనియాడారు. జిల్లాలో ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు అనే తేడా లేకుండా విద్యార్థులందరికీ అత్యుత్తమ విద్యను అందించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. పదవ తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించేందుకు చక్కటి ప్రణాళిక రూపొందించి అమలు చేయడం అభినందనీయమన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు భాగస్వాములు అయ్యేవిధంగా ఉపాధ్యాయుల ద్వారా ప్రోత్సాహం అందించి వారిని అన్ని రంగాల్లో రాణించే విధంగా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేశారన్నారు. జిల్లాలో వివాదరహితుడిగా చక్కటి సేవలు అందించడం అభినందనీయమన్నారు . ఈ కార్యక్రమంలో ట్రస్మా పట్టణ అధ్యక్షులు ఎండి ఖదీర్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజేష్ కుమార్,ఎంఈఓ బాలాజీ,సెక్టోరియల్ అధికారులు రాజేంద్రకుమార్, సంగీత,యాదయ్యశెట్టి, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు,ప్రిన్సిపల్స్ బాలప్ప,ఆంజనేయులు, వరలక్ష్మి,చిన్న ,ఇమ్రాన్ భాషా, ఆనంద్,సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్ నగరంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో మహిళల ధర్నా





**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 8 (డీకే చాటింపు):** అసెంబ్లీ ఆవరణలో మహిళా ఎమ్మెల్యేలుసునీతాలక్ష్మారెడ్డి , సబితా ఇంద్రారెడ్డిలపై జరిగిన దాడిని నిరసిస్తూ నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆధ్వర్యంలో చీ= చౌరస్తా ధర్నా చౌక్ లో భారీ ఎత్తున బీఆర్ఎస్ మహిళా నాయకులు మరియు కార్యకర్తలు తరలివచ్చి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నిలయమైన అసెంబ్లీ ఆవరణలో మహిళా ప్రజాప్రతినిధులపై దాడి జరగడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమని అన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై అసెంబ్లీ ఆవరణలో పోలీసుల దాడి ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టుగా అభివర్ణిస్తూ నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి మహిళా నేతలు గళం విప్పారు .ప్రజల తరఫున ప్రశ్నించే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి బాధ్యులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మహిళా ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ నినాదాలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసనతెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతుకిరణ్,మాజీ కార్పొరేటర్లు విశాలిని రెడ్డి, సిర్ప సువర్ణ,మంజుల యాదవ్,చింతకాయల అలేఖ్య,గంగ ,సంధ్య తదితరులు తదితరులు పాల్గొన్నారు.


# జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్క ని కలిసిన ఆర్మూర్ ఎమ్మెల్యే

**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 8 (డీకే చాటింపు):**ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ఈరోజు మంగళవారం అసెంబ్లీ ప్రాంతంలో నిజాంబాద్ జిల్లా ఇన్చార్జి మంత్రి సీతక్కను కలిసి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. నియోజకవర్గం లోని అన్ని గ్రామాలలో దాదాపు 157ఎఎ మేర రోడ్లకు పంచాయతీ రాజ్ శాఖ కింద నూతన బీటీ రోడ్లకు 163 కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర గౌరవ పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు సీతక్క గారికి వినతి పత్రం ద్వారా తెలుపడం జరిగింది.



# బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో సీటు కోసం వెబ్ ఆప్షన్స్ పెట్టుకోండి...

**- ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్...**



**బెల్లంపల్లి(డీకే చాటింపు )**బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంకాం కోర్సులలో ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఎంఏ పొలిటికల్ సైన్స్ , ఎం ఏ ఇంగ్లీష్, ఎంకాం కోర్సులను సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. 2026-27 విద్యా సంవత్సరంలో పీజీలో ప్రవేశానికి కాను టీజీ సిపి గెట్-2026 రాసి ఉత్తీర్ణులైన విద్యార్థులతో పాటు ఉత్తీర్ణులు కాని ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు బెల్లంపల్లి ప్రభుత్వ పీజీ కళాశాలలో సీటు కోసం మొదటి ప్రాధాన్యత గా ఆప్షన్ పెట్టుకోవాలని వివరించారు. 14వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభమైన పిజి సెంటర్ విజయవంతంగా కొనసాగుతుందని తెలిపారు. బెల్లంపల్లిలో స్థానికంగా లభిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు ఈ ఫోన్ నెంబర్ 9959269975 లో సంప్రదించాలని కోరారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
బుధవారం, సెప్టెంబర్,9, 2026

# యుద్ధ అంచున నిలిచిన ప్రపంచం!

పశ్చిమాసియాలో మళ్లీ సంగ్రామ మేఘాలు కమ్ముకొంటున్నాయి. "ఆపరేషన్ ఎపిక్ ఫూరీ" పేరుతో కొనసాగుతున్న అమెరికా, ఇజ్రాయిల్ సంయుక్త సైనిక చర్యలు, వాటికి ప్రతిస్పందనగా ఇరాన్ చేసిన ప్రతిఘటన ప్రకటనలు, ఐక్యరాజ్య సమితి భద్రతామండలి అత్యవసర సమావేశం ఈ సమస్త పరిణామాలు ప్రపంచ రాజకీయ రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ దేశ రక్షణకు ముప్పు కలిగించే శక్తులను అడ్డుకోవడంలో వెనుకాడబోమని స్పష్టం చేయగా, ఇరాన్ విదేశాంగ మంత్రి హ్సస్సేన్ అమీరాబాద్ డొల్లాహియన్ తమ దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడుకోవడంలో ఎటువంటి రాజీ ఉండదని ఘాటుగా ప్రకటించారు. మాటల స్థాయిలో ప్రారంభమైన ఈ ప్రతిస్పందనలు క్రమంగా సైనిక కదలికల రూపంలోనూ వ్యక్తమవుతున్నాయి. ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణంగా ఇరాన్ అణు కార్యక్రమాన్ని అమెరికా, ఇజ్రాయిల్ పేర్కొంటున్నాయి. 2015 సంవత్సరంలో కుదిరిన ఉమ్మడి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఒప్పందం ప్రకారం ఇరాన్ అణు శక్తి అభివృద్ధిని నియంత్రించేందుకు అంతర్జాతీయ పర్యవేక్షణకు అంగీకరించింది. అయితే ఆ ఒప్పందం నుంచి అమెరికా వైదొలిగిన తర్వాత అనుమానాలు మళ్లీ పెరిగాయి. ఇరాన్ యురేనియం శుద్ధీకరణ స్థాయిని పెంచుతోందన్న ఆరోపణలతో ఇజ్రాయిల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తమ భద్రతకు ప్రత్యక్ష ముప్పు ఏర్పడుతుందనే భావనతో ఇజ్రాయిల్ ఇరాన్‌లోని కొన్ని అణు కేంద్రాలపై గగనతల దాడులు నిర్వహించినట్లు వార్తలు వెలువడ్డాయి. అమెరికా కూడా ఈ చర్యలకు మద్దతు తెలుపుతున్నదనే అభిప్రాయం బలపడుతోంది. ఇరాన్ మాత్రం తన అణు కార్యక్రమం పూర్తిగా శాంతియుత అవసరాలకేనని, విద్యుత్ ఉత్పత్తి మరియు శాస్త్రీయ పరిశోధనల కోసమేనని స్పష్టం చేస్తోంది. అంతర్జాతీయ అణుశక్తి పర్యవేక్షణ సంస్థ పర్యవేక్షణలోనే తమ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని పేర్కొంటోంది. అయితే ఇజ్రాయిల్ దృష్టిలో ఇరాన్ అణు సామర్థ్యం భవిష్యత్తులో ప్రాణాంతక ముప్పుగా మారే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో అమెరికా?ఇజ్రాయిల్ చర్యలు రక్షణాత్మక చర్యలేనని వారు వాదిస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి అత్యవసర సమావేశం నిర్వహించి తక్షణ సంగ్రామ విరమణకు పిలుపునిచ్చింది. చర్చల ద్వారానే సమస్య పరిష్కారం సాధ్యమని సభ్యదేశాలు అభిప్రాయ పడ్డాయి. రష్యా, చైనా వంటి దేశాలు ఈ దాడులను తీవ్రంగా ఖండించగా, యూరోపియన్ దేశాలు పరిస్థితి అదుపు తప్పకూడదని హెచ్చరించాయి. ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి శాంతి సాధనకే ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అయితే భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాల మధ్య ఉన్న విభేదాలు ఏకాభిప్రాయ నిర్ణయానికి అడ్డంకిగా నిలుస్తున్నాయి. గల్ఫ్ ప్రాంత దేశాలు అత్యవసరంగా సమావేశ మవడం పరిస్థితి తీవ్రతను స్పష్టంగా తెలియ జేస్తోంది. సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, ఖతర్, కువైట్ వంటి దేశాలు తమ భూభాగం సంగ్రామ రంగంగా మారుతుందేమోనని ఆందోళన చెందుతున్నాయి. హార్మూజ్ సముద్ర మార్గం ప్రపంచ చమురు రవాణాకు కీలక జీవనాధారం. ప్రపంచ చమురు సరఫరాలో పెద్ద భాగం ఈ మార్గం ద్వారా సాగుతుందని అంచనాలు చెబుతున్నాయి. అక్కడ సైనిక ఘర్షణలు ఉద్ధృతమైతే ప్రపంచ ఇంధన సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుంది. ఇప్పటికే చమురు ధరల్లో పెరుగుదల సూచనలు కనిపిస్తున్నాయి. జర్మనీ, బ్రిటన్ వంటి దేశాలు అమెరికాకు మద్దతుగా నిలిచే అవకాశమున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే ప్రత్యక్ష సైనిక ప్రవేశంపై యూరోపియన్ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. మరోవైపు రష్యా, చైనా ఈ దాడులను ఆధిపత్య రాజకీయాల ప్రతిబింబంగా విమర్శిస్తున్నాయి. ఉక్రెయిన్ సంగ్రామం కారణంగా ఇప్పటికే పాశ్చాత్య దేశాలతో విభేదాలు ఉన్న రష్యా, ఈ సందర్భాన్ని వ్యూహాత్మకంగా వినియోగించుకునే అవకాశముంది. మూడవ ప్రపంచ సంగ్రామం సంభవిస్తుందా అన్న ప్రశ్న ఇప్పుడు గంభీరంగా వినిపిస్తోంది. ఒకవేళ అమెరికా?ఇజ్రాయిల్?యూరోపియన్ దేశాలు ఒకవైపు, ఇరాన్‌కు మద్దతుగా రష్యా?చైనా మరోవైపు నిలిస్తే ప్రపంచం రెండు శిబిరాలుగా విడిపోయే ప్రమాదం ఉంది. ఆధునిక సంగ్రామ స్వరూపం కేవలం భూయుద్ధంతో పరిమితం కాదు. క్షిపణి దాడులు, మానవ రహిత యంత్ర వాహనాల వినియోగం, సమాచార యుద్ధం, ఉపగ్రహ వ్యవస్థల విధ్వంసం, ఆర్థిక ఆంక్షలు?ఇవన్నీ సమాంతరంగా జరుగుతాయి. అణు ఆయుధాల వినియోగం అనే భయానక అంశం ప్రపంచాన్ని కుదిపేస్తోంది. అణు సంగ్రామం జరిగితే మానవజాతి, పర్యావరణం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తిరుగులేని నష్టం సంభవిస్తుంది.

విలేకరులు కావలెను
రాజకీయ సంచలనాలకు ప్రతీకగా నిలిచిన
డీకే సారధ్యంలో చాటింపు
తెలంగాణ దినపత్రిక
డీకే సారధ్యంలో చాటింపు దినపత్రికలో పనిచేయడానికి తెలంగాణాలోని అన్ని జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో పనిచేయడానికి ఆసక్తి, అనుభవం గల విలేకరులు కావలెను.
సంప్రదించండి:
సెల్ : 9603754136 - 7386287837

# నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

## -రూ.90 వేల లంచం డిమాండ్... -రూ.50 వేలు ఇచ్చిన బాధితుడు...
## -సబ్ రిజిస్ట్రార్ తో పాటు మరో వ్యక్తిని అరెస్టు చేసిన ఏసీబీ అధికారులు...
## -ఏసీబీ దాడులతో షాపులను మూసివేసిన డాక్యుమెంట్ రైటర్లు...





**నారాయణపేట,(డీకే చాటింపు):** నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో అకస్మాత్తుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకునిసోదాలు నిర్వహించారు. మహబూబ్ నగర్ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఈ సోదాలు జరిగాయి. ఇందుకు సంబంధించిన వివరాలను మహబూబ్ నగర్ ఏసీబీ డిఎస్పి బాలకృష్ణ విలేకరులకు వెల్లడించారు. నారాయణపేట సబ్ రిజిస్టర్ కార్యాలయ పరిధిలో గతజూలై నెల మూడవ వారంలో జరిగిన ఓ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో స్థానిక సబ్ రిజిస్ట్రార్ రూ.90వేల లంచం డిమాండ్ చేసినట్లు బాధితులు ఏసీబీకి ఫిర్యాదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. జూలై 21వ తేదీన .50 వేలు ఇచ్చిన బాధితుడు మిగిలిన మొత్తాన్ని ఈనెల 3న (సోమవారం)ఇచ్చినట్లు ప్రాథమిక ఆధారాలతో ఏసీబీ అధికారులు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. మధ్యవర్తి కమ్మరి నాగరాజు(నగేష్)ద్వారా సబ్ రిజిస్ట్రార్ లగిశెట్టి వెంకటస్వామి డబ్బులు తీసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. వీరిద్దరిని అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. అనంతరం వీరిద్దరిని రిమాండ్ నిమిత్తం నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరుస్తున్నట్టు ఆయన తెలిపారు.

**షాపులు బంద్ పరార్...**

ఇదిలా ఉండగా నిత్యం రద్దీగా ఉండే పరిసర ప్రాంతం ఏసీబీ దాడులతో బోసిపోయిన షాపులు డాక్యుమెంట్ రైటర్లు తమ షాపులను మూసివేసి అక్కడి నుంచి జారుకున్నారు. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఏసీబీ సోదాలు జరగడంతో అప్పటినుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిలిచిపోయింది. చాలామంది క్రయవిక్రయిదారులు రిజిస్ట్రేషన్ కోసం వచ్చి వెనుతిరిగారు.

**ఇతర కార్యాలయాల్లోనూ కలకలం...**

నారాయణపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ చర్యల విషయం జిల్లా కేంద్రంలోని ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు చేరడంతో అధికారులు, సిబ్బందిలోనూ చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ దాడుల నేపథ్యంలో పలువురు అధికారులు తమ విధుల్లో అప్రమత్తంగా వ్యవహరించినట్లు సమాచారం.


# స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వాక్యాలు చేసిన తాత మధు పై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి....

## - ఎం హెచ్ డి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక రాజనర్సు....



**బెల్లంపల్లి (డీకే చాటింపు )** స్పీకర్ గడ్డం ప్రసాద్ పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను మాదిగ హక్కుల దండోరాతీవ్రంగా ఖండిస్తుందని రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు చిలుక రాజనర్సు అన్నారు రాజ్యాంగ బద్ధమైన స్పీకర్ పదవిలో ఉన్న ఒక దళిత బిడ్డ అయిన గడ్డం ప్రసాద్ తల్లి ఉద్దేశించి సంస్కార హీనంగా మాట్లాడిన తాత మధు పై ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి అలాగే అతన్ని ఎమ్మెల్సీ పదవి నుండి తక్షణమే బర్తరప్ చేయాలని మాదిగ హక్కుల దండోరా డిమాండ్ చేస్తుందని అన్నారు దీనికి పూర్తి బాధ్యత కేసీఆర్ బాధ్యత వహించి ఎమ్మెల్సీ తాతా మధు నుబీ ఆర్ ఎస్ పార్టీ నుండి వెంటనే బహిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏవైనా సమస్యలు ఉంటే శాసనసభ లో మాట్లాడి పరిష్కరించాలి కానీ బజార్లో రౌడీ లాగా ప్రవర్తించడం, మహిళలు ఉన్నారని కూడా చూడకుండా పహిల్వాన్ లాగా షర్ట్స్ విప్పుకొని గొడవ చేయడం సరియైన చర్య కాదని హితవు పలికారు. 10 ఏళ్లు అధికారంలో ఉండి మీరు నేర్చుకున్నది ఇదేనా అని ప్రశ్నించారు, అసెంబ్లీ లో ప్రజా సమస్యలు గాలికి వదిలి వ్యక్తిగత రాజకీయాలు చేస్తూ ప్రజలు హాస్యహించుకునేలాగా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారుఒక దళిత సభాధ్యక్షుణి తల్లిని ఉద్దేశించించి అగ్రకుల దురహంకారంతో కండ కండ కావరంతో అత్యంత అవమాన కారంగా మాట్లాడితేబీ ఆర్ ఎస్ పార్టీ లో ఉన్న దళిత నాయకులు స్పందించక పోవడం చాల బాధాకరం అని అన్నారు

# నల్ల హనుమాన్ మందిర్ లో మంగళవారం తమల ఆకుల,వడ మాలతో పూజలు



**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 8 (డీకే చాటింపు):** శ్రావణమాసం చివరి మంగళవారం కావడంతో నిజామాబాద్ నగరంలోని హనుమాన్ ఆలయంలలో, వినాయక ఆలయం లలో తమలపాకుల తో భక్తులు విశేష పూజలు చేశారు. ఈరోజు నల్ల హనుమాన్ మందిర్ లో ఆకు పూజలు వడమాలలతో పూజారులు ప్రవీణ్ పంతులు శ్రీనివాసరావు పంతులు విశేష పూజలు అభిషేకాలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఆన్లైన్ ద్వారా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మాజీ ఎమ్మెల్యే మైనంపాటి హనుమంతరావు అదేవిధంగా జన్నేపల్లి కి చెందిన రచ్చ మురళి దంపతులు పూజలు చేశారు.సి ఎన్ ఆర్ హోమ్స్ నుండి సత్యనారాయణ లు ఆకు పూజ మరియు అరటి పండ్లు తో ఆంజనేయ స్వామిక అభిషేకంచేయించారు. గాజులపెట్ నుండి విచ్చేసిన భక్తులు పూజలు ,అభిషేకాలు నిర్వహించారు.

# ఆర్ఎంపి పిఎంపీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

## - ఆత్మగౌరవ సభ లో ఎమ్మెల్సీ డాక్టర్ కోదండ రెడ్డి





**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 8 (డీకే చాటింపు):** రాష్ట్రంలో ఉన్న 36 వేల మంది పిఎంపి ఆర్.ఎం.పి లకు కమ్యూనిటీ పారా మెడిక్ శిక్షణ మరియు సర్టిఫికెట్లు జారీ చేయుట గురించి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మ గౌరవ సభ ఏర్పాటు చేశారు. ఇట్టి సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ డాక్టర్ కోదండ రెడ్డి మాట్లాడుతూ పిఎంపి ఆర్.ఎం.పి లకు ఎదురవుతున్న సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని అంతేకాకుండా పారామెడి శిక్షణకు వైద్య ఆరోగ్యశాఖతో మాట్లాడుతానని అన్నారు. ప్రభుత్వం ఇచ్చే శిక్షణ కొరకు 36,000 మంది కట్టారని యాక్షన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు చొప్పరి శంకర్ ముదిరాజ్ పులగమ్మోహన్ తెలుపగా, ఎమ్మెల్సీ సానుకూలంగా ప్రతిస్పందించారు. గత కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైయస్సార్ ఇచ్చిన జీవో నెంబర్ 1273/2009 ప్రకారం శిక్షణ పూర్తి చేసి సర్టిఫికెట్లు జారీ చేయాలి కోరారు. ఏంటి ఆర్ఎంపీలపై ప్రభుత్వపరంగా దాడులు ఆపాలని, వైద్య ఆరోగ్యశాఖ ద్వారా ఆరోగ్య తెలంగాణలో భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా ముక్తకంఠంతో కోరారు. అనుభవ వైద్యుల సంఘాల సమాఖ్య నాయకులు, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఆర్ఎంపి పిఎంపీలు ,నాయకులు నగేష్, రమాశంకర్, సత్యనారాయణ, నాగేశ్వరరావు ,బాలరాజు, శంకరయ్య ,రవీందర్, భాస్కర్, రవి వర్మ, నవీన్ తదితరులు భారీగా తరలివచ్చారు.

# గని ప్రమాదంపై స్పందించిన ఎమ్మెల్యే వినోద్ వెంకటస్వామి....

## - కార్మికులకు అండగా ఉంటామని భరోసా...



**బెల్లంపల్లి (డీకే చాటింపు )** కాసిపేట-2 ఇంక్లైన్ గనిలో జరిగిన ప్రమాదంపై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి స్పందించారు. సింగరేణి జీఎం, సూపరింటెండెంట్ ని ఫోన్‌లో సంప్రదించి ప్రమాద వివరాలతో పాటు గాయపడిన కార్మికుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గాయపడిన కార్మికులకు అవసరమైన అన్ని వైద్య సదుపాయాలు కల్పించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్మికుల కుటుంబాలకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా అండగా ఉంటాను అని భరోసా ఇచ్చారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి, భద్రతా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా చర్యలను మరింత పటిష్ఠం చేయాలని ఎమ్మెల్యే అధికారులను కోరారు.


# గణేష్ ఉత్సవాలకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి

## - బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి..



**ఎల్బీనగర్, సెప్టెంబర్ 8 (డీకే చాటింపు)** రానున్న వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలలో ఆస్మాన్‌ఘాట్ విద్యుత్ పరిధికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గడ్డిఅన్నారం డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు ఈరోజు ఉదయం డి.ఈ. విష్ణువర్ధన్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని వివిధ కాలనీలలో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ వైర్లు తదితర సమస్యలను డి.ఈ. గారి దృష్టికి తీసుకెళ్లి, వినాయక చవితి ఉత్సవాల సమయంలో భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు మరియు ప్రమాదాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు వివరించిన సమస్యలపై డి.ఈ. విష్ణువర్ధన్ రెడ్డి గారు సానుకూలంగా స్పందించి, సమస్యలను వెంటనే పరిశీలించి పరిష్కరించేలా ఏ.డి.ఈ. అనిల్ గారికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా విద్యుత్ శాఖ అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి గారు కోరారు.

# మహేశ్వరం నియోజకవర్గంబీసీ ఫెడరేషన్ కులాల సమితి నూతన కార్యవర్గం ఏర్పాటు



**మహేశ్వరం, సెప్టెంబర్ 8 (డీకే చాటింపు)** బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో ఈ రోజు బీసీ సాధికారిక భవన్ కోటి నందు జరిగిన సమావేశం లో మహేశ్వరం నియోజకవర్గం అధ్యక్షునిగా కలకొండ శ్రీనివాస చారిని,, మహేశ్వరం నియోజకవర్గ యూత్ అధ్యక్షులుగా పతనబోయిన సురేందర్ ని రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు. ప్రధాన కార్యదర్శి కీర్తి యుగేందర్, మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జి వజ్రోజు రవీంద్ర చారి. మరియు పసునూరి బిక్షపతి చారి ఆధ్వర్యంలో నియామక పత్రం అందజేయడం జరిగింది..


# జనసేనలోకి 50 మంది యువత చేరిక



**మంచిర్యాల(డీకే చాటింపు):** మంచిర్యాల జిల్లా జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు ఆవుల సాగర్, పిట్టలా సుధాకర్ ఆధ్వర్యంలో పార్టీ చేరికల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాసామల్ల రాజేష్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది యువత జనసేన పార్టీలో చేరారు. పెద్దపల్లి, ఆదిలాబాద్ కో-ఆర్డినేటర్ చుంచు రాజకిరణ్, పెద్దపల్లి కో-ఆర్డినేటర్ మంథని సంపత్ పార్టీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చుంచు రాజకిరణ్ మాట్లాడుతూ.. జనసేన పార్టీ యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు జనసేన పార్టీ సిద్ధంగా ఉందని, అన్ని ప్రాంతాల్లో పార్టీ నాయకులు పోటీకి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీని మరింత బలోపేతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నల్లతిగల మహేష్, ఆవునూరి రమేష్, మల్లంపెల్లి విష్ణు, చరణ్ తదితరులు పాల్గొన్నారు. పార్టీలో చేరిన యువకుల్లో మర్రి శ్రవణ్, మర్రి కృష్ణ, కళ్యాణ్, కుమ్మరి సూర్యచంద్ర, వినోద్, వైష్ణవ్ తదితరులు ఉన్నారు.

# ఘనంగాశివాలయంలో శ్రీశ్రీ నాగేంద్ర స్వామి ఆలయ ప్రతిష్టాపన

## - పూజలో పాల్గొన్న మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్



**ఎల్బీనగర్,, సెప్టెంబర్ 8 (డి కే చాటింపు)** కర్మన్ ఘాట్ డివిజన్ లోని దుర్గా నగర్ కాలనీలో అతి పురాతన ప్రాచీనమైన చరిత్ర కలిగిన శివాలయంలో శ్రీశ్రీ నాగేంద్ర స్వామి ఆలయ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా ఆలయ వ్యవస్థాపకులు సోమ దయానంద్ .. ప్రతిష్టాపనా విగ్రహాలను అందజేసిన దాతలు రాజేష్ సౌందర్య ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ మరియు దుర్గా నగర్ కాలనీ ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాసరెడ్డి గారు, ఆలయ నిర్వాహకులు బన్నే బీరప్ప, కొండ యాదగిరి, తిరుపతి రెడ్డి, మల్లేష్, చంద్రశేఖర్ రెడ్డి, పురుషోత్తం గారు ప్రత్యేక పూజలు నిర్వహించినారు.. భక్తులు అన్నప్రసాద కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేసినారు..

# నీటిపారుదల శాఖ మంత్రిని కలిసిన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 8 (డీకే చాటింపు) ఆర్మూర్ ఎమ్మెల్యే మంగళవారం నాడు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమకుమార్ రెడ్డిని కలిసి సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది గుత్ప బ్యాలెన్సింగ్ ట్యాంక్ పై లిఫ్ట్ ఇరిగేషన్ యొక్క మిగిలిన పనులను వెంటనే పూర్తి చేసి గుత్ప,మామిడి పల్లి, రామచంద్రపల్లి, అంకాపూర్ మదన్పల్లి,చిన్నాపూర్ ఒడెట్ పల్లి,మరియు అమ్రాద్ జక్రాన్ పల్లి అర్గుల్,లక్ష్మాపూర్ మరియు మునిపల్లి గ్రామాల లోని రూ. 7 కోట్లు రూపాయలు విలువైన పనులను వెంటనే పూర్తిచేసి 2642 ఎకరాలకు నీరు అందించాలని అలాగే నియోజకవర్గం లోని నిజాంసాగర్ కాల్వల ఆధునికీకరణ పనుల కోసం మంజూరైన 22 కోట్ల రూపాయల పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి. బినోల--కంఠం--చిక్లీ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ప్రారంభంరూ.80 కోట్లు అంచనా వ్యయంతో మంజూరైన పనులను వెంటనే ప్రారంభించి 5550 ఎకరాల కొత్త ఆయకట్టును నీరు అందించాలని ఈ పథకం ద్వారా:బినోల గ్రామం (బోధన్ నియోజకవర్గం): 2000 ఎకరాలుకంఠం–చిక్లీ గ్రామాలు (ఆర్మూర్ నియోజకవర్గం): 3550 ఎకరాలు నీరు అందుతాయి.



మరియు నియోజవర్గం లోని పలు పెండింగ్ పనులను తక్షణమే పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర గౌరవ ఇరిగేషన్ శాఖ మంత్రివర్యులు శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గారికి వినతి పత్రం ద్వారా కోరడం జరిగింది.

# ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, సెప్టెంబర్8,(డీకే చాటింపు):** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ లో గల ఈవీఎం గోదాంను మంగళవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తనిఖీ చేసారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ..ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ, గోదాం భద్రత, రక్షణకు సంబంధించిన అంశాలపై సమగ్ర నివేదికలను ఎన్నికల సంఘానికి పంపిస్తున్నట్లు తెలిపారు.ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు చేపట్టిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గోదాం వద్ద సిబ్బంది హాజరు తీరుపై కూడా ఆరా తీశారు. ఈవీఎం గోదాం వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనంతరం ఈవీఎం గదులు, వీవీప్యాట్ గదుల్లో ఏర్పాటు చేసిన భద్రతా చర్యలను రాజకీయ పార్టీ ప్రతినిధులతో పరిశీలించి, సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రి



భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, అర్బన్ తహసీల్దార్ రాం మోహన్, ఎన్నికల పర్యవేక్షకులు జ్యోతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది, పోలీస్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు ప్రపంచ

## - ఫిజియోథెరపీ డే శుభాకాంక్షలు.. సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వి.క్రాంతి కుమార్

**హనుమకొండ సెప్టెంబర్ 08 (డీకే చాటింపు)** గ్రేటర్ వరంగల్ హనుమకొండ వడ్డేపల్లి జవహర్ కాలనీ సర్కిల్ రోడ్డులో గల ఆక్టివ్ బ్యాలెన్స్ ఫిజియోథెరపీ క్లినిక్ నందు సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వి.క్రాంతి కుమార్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు ,మిత్రులకు,పేషెంట్లకు,ఫిజియోథెరపీ డాక్టర్లకు, శ్రేయోభిలాషులకు ప్రపంచ ఫిజియోథెరపీ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ ఆక్టివ్ బ్యాలెన్స్ ఫిజియోథెరపీ క్లినిక్ నందు అత్యాధునిక రోబోటిక్ స్పైనల్ డిస్క్ కంప్రెషన్ మిషన్ ఫిజియోథెరపీ సేవలతో వెన్నెముకపై ఒత్తిడి నివారణ అందుబాటులో ఉన్నాయని,రేడియల్ షాక్ థెరపీ, క్లాస్ 4,లేజర్, ఎల్.ఎఫ్.టి.అండ్



అల్ట్రా సౌండ్ తో మెడ నొప్పి, భుజం నొప్పి, నడుము నొప్పి నివారణ చేస్తున్నామని,ఆపరేషన్ తర్వాత కలిగే కీళ్ళు, కండరాల నొప్పులకు నివారణ ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో సిబ్బంది,పేషంట్లు,తదితరులు పాల్గొన్నారు.

# ఇందూరు పట్టణంలో వినాయకుల సందడి షురూ





**నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 8 (డీకే చాటింపు):** వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని ఇందూరు (నిజామాబాద్ )పట్టణంలో యువత ఉత్సాహంగా మండపాలను డెకరేట్ చేసుకుంటున్నారు. పోచమ్మ గల్లీలో భారీ మట్టి వినాయకుడిని తయారు చేస్తున్నారు. పాలిటెక్నిక్ కళాశాల ముందు మట్టి విగ్రహాలు చిన్నవి పెద్దవి అదేవిధంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్తో చేసిన విగ్రహాల స్టాళ్లను ఏర్పాటు చేశారు. యువత హైదరాబాద్ నుండి నిజామాబాద్ కు భారీ విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొని వచ్చారు. 3.30 లక్షలు వెచ్చించి భారీ విగ్రహాన్ని తీసుకొచ్చినట్లు శ్రీ విఘ్నేశ్వర యూత్ సుభాష్ నగర్ అధ్యక్షుడు పాల సురేష్ తెలిపారు. శాస్త్రి యువజన గణేష్ మండలి శాస్త్రి నగర్ అయ్యప్ప గుడి దగ్గర భారీ విగ్రహం ఏర్పాటు చేసి 11 రోజులు ఉత్సవాలను ఘనంగా జరుపుతామని ,ఈ విగ్రహం 2.80 లక్షలతో భాగ్యనగరం నుండి తేచ్చామని అధ్యక్ష, కార్యదర్శులు బలరాం ,నరేష్ తెలిపారు.

# లోకల్ పోరులో వైసీపీ..!



విజయవాడ: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ఆసక్తికరంగా మారాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇటీవల తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశాల్లో పార్టీ కేడర్‌కు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులకు అత్యంత స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.ఎక్కడా ఏకగ్రీవాలకు తావివ్వకూడదు, ప్రతి స్థానంలోనూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విధిగా బరిలో నిలబడి గట్టి పోటీ ఇవ్వాలి అని ఆదేశించారు. అయితే, 2021 స్థానిక ఎన్నికల్లో వేలాది పంచాయతీలు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను ఏకగ్రీవం చేసుకుని రికార్డు సృష్టించిన వైఎస్సార్‌సీపీ.. ఇవాళ ఏకగ్రీవాలు వద్దే వద్దు, పోటీ పడాల్సిందే అని పట్టుబట్టడం వెనుక కీలక రాజకీయ వ్యూహం ఉంది. గతంలో తమకు కలిసివచ్చిన ఏకగ్రీవ సూత్రాన్ని జగన్ ఇప్పుడు తీవ్రంగా వ్యతిరేకించడం వెనుక ప్రధానంగా కేడర్ నైతిక స్థైర్యం దెబ్బతిందనే ఆందోళన కనిపిస్తోంది. 2024 శాసనసభ ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితమై దారుణ ఓటమిని చవిచూసిన తర్వాత, క్షేత్రస్థాయిలో ద్వితీయ శ్రేణి నేతలు, గ్రామస్థాయి కార్యకర్తలు తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. ఇప్పుడు అధికారంలో ఉన్న టీడీపీ–జనసేన–బీజేపీ కూటమి హవా నడుస్తోంది. ఈ పరిస్థితుల్లో పంచాయతీ లేదా మండల స్థాయిల్లో ఎన్నికలు వస్తే, అధికార పక్షం బెదిరింపులకో లేక ప్రలోభాలకో లొంగిపోయి వైఎస్సార్‌సీపీ నాయకులు నామినేషన్లు కూడా వేయకుండా వెనక్కి తగ్గుతారని జగన్ బలంగా సందేహిస్తున్నారు. బరిలోనే నిలబడకుండా ఏకగ్రీవాలకు సహకరిస్తే, అది పార్టీ క్షేత్రస్థాయి వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిందనే సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తుందనేది ఆయన భయం.పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున కూటమి వైపు లేదా అధికార టీడీపీ వైపు వలస వెళ్తారనే ఆందోళన. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయకపోతే, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులు తమ వ్యాపారాలు, కాంట్రాక్టులు, లేదా స్థానిక ఉనికిని కాపాడుకోవడానికి అధికార పార్టీతో లోపాయికారీ ఒప్పందాలు కుదుర్చుకునే ప్రమాదం ఉంది. ఒకసారి స్థానిక నేతలు టీడీపీతో కరచాలనం చేస్తే, వారితో పాటు కింద ఉన్న సాంప్రదాయ ఓటు బ్యాంకు కూడా చేజారిపోతుంది. ఈ రకమైన గ్రౌండ్ లెవెల్ మెల్ట్‌డౌన్ నిరోధించాలంటే.. వారిని బలవంతంగానైనా పోలింగ్ బరిలో నిలబెట్టి, పార్టీ రంగు పులుముకునేలా చేయడం తప్ప జగన్‌కు వేరే మార్గం కనిపించడం లేదు.

# కేరళలో ట్రీట్ మెంట్ కు పవన్... పాలిటికల్ స్టైల్ కు మారలేకపోతున్న జనసేనాని

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశాలకు వరుసగా గైర్హాజరవుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి తర్వాత కేబినెట్‌లో కీలక స్థానం కలిగిన డిప్యూటీ సీఎం తరచూ సమావేశాలకు దూరంగా ఉండటం.. ప్రభుత్వ పరిపాలనపై, జనసేన పాత్రపై ప్రతిపక్షాలకు విమర్శలు చేసే అవకాశం కల్పిస్తోంది.పవన్ కల్యాణ్ గైర్హాజరీకి ప్రధాన కారణం ఆయన ఆరోగ్య పరిస్థితేనన్న చర్చ సాగుతోంది. గతంలో ఎదురైన గాయాలు, వెన్ను సంబంధిత సమస్యలు, అనారోగ్య సమస్యల కారణంగా ఆయనకు అప్పుడప్పుడు విశ్రాంతి అవసరమవుతోందని తెలుస్తోంది.రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత నిరంతర పర్యటనలు, ప్రజా కార్యక్రమాలు, అధికారిక సమీక్షలు, పార్టీ వ్యవహారాలతో పాటు దీక్షలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు కూడా ఆయనపై శారీరక ఒత్తిడిని పెంచుతున్నాయి.ఉప ముఖ్యమంత్రి పదవిలో ఉన్న వ్యక్తికి ఆరోగ్య సమస్యలు ఉన్నప్పటికీ.. పాలనకు నిరంతర అందుబాటు కూడా కీలకమే. ముఖ్యంగా కేబినెట్ సమావేశాల్లో విధానపరమైన నిర్ణయాలు, శాఖలకు సంబంధించిన అంశాలపై చర్చలు జరుగుతాయి కాబట్టి గైర్హాజరు రాజకీయంగానూ ప్రాధాన్యత సంతరించుకుంటోంది.పవన్ కల్యాణ్ రాజకీయ బాధ్యతలతో పాటు గతంలో ఒప్పుకున్న సినిమాల షూటింగ్‌లను పూర్తి చేస్తున్నారు. దీంతో ఆయన షెడ్యూల్‌పై అదనపు ఒత్తిడి ఏర్పడుతోందన్న అభిప్రాయం ఉంది.ఒకవైపు సినిమా షూటింగ్‌లు, మరోవైపు మంత్రిగా పర్యటనలు, సమీక్షలు, పార్టీ కార్యక్రమాలు కొనసాగితే విశ్రాంతికి సమయం తగ్గిపోవడం సహజం. గతంలో సినిమా రంగంలో ఉన్న ఫ్లెక్సిబుల్ షెడ్యూల్‌కు భిన్నంగా.. ప్రభుత్వ వ్యవహారాల్లో నిర్ణీత సమయాల్లో అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉంటుంది.ఇక్కడే పవన్‌కు అసలు సవాలు ఎదురవుతోంది. సినిమా, రాజకీయాలు రెండింటినీ సమన్వయం చేయడం కంటే.. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ పరిపాలనకు ప్రాధాన్యత ఇవ్వడం ఇప్పుడు మరింత అవసరం.పవన్ కల్యాణ్‌కు అప్పగించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు రాష్ట్రంలోని గ్రామీణ





ప్రాంతాలతో నేరుగా సంబంధం ఉన్న కీలక శాఖలు. ఈ శాఖల్లో విధాన నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ నిరంతరం కొనసాగాల్సి ఉంటుంది.కేబినెట్ సమావేశాలకు వరుసగా దూరంగా ఉండటం వల్ల నిర్ణయ ప్రక్రియలో జనసేనకు సంబంధించిన రాజకీయ ప్రాధాన్యం తగ్గే అవకాశం ఉందనే చర్చ కూడా జరుగుతోంది. అయితే దీనిని పవన్ శాఖల పనితీరుతో నేరుగా ముడిపెట్టే ముందు.. ఆయన గైర్హాజరీకి ఉన్న వాస్తవ కారణాలు, శాఖల పనితీరు వంటి అంశాలను విడిగా చూడాల్సి ఉంటుంది.ఆరోగ్య సమస్యలు నిజంగా ఉంటే వాటి నుంచి పూర్తిగా కోలుకోవడం మొదటి ప్రాధాన్యత. అదే సమయంలో సినిమా కమిట్‌మెంట్లను ఒక దశలో ముగించి, రాజకీయ బాధ్యతలకు స్పష్టమైన సమయాన్ని కేటాయించడం అవసరం.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వంటి నిరంతరం పనిచేసే నాయకుడితో కలిసి ప్రభుత్వాన్ని నడిపిస్తున్న నేపథ్యంలో పవన్ తన పాత్రను మరింత స్పష్టంగా, నిరంతరంగా చూపించాల్సిన అవసరం ఉంది.కేబినెట్ సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరు కావడం, శాఖలపై ప్రత్యక్ష పర్యవేక్షణ పెంచడం, ప్రభుత్వ నిర్ణయాల్లో చురుకైన భాగస్వామ్యం చూపించడం ద్వారా ప్రస్తుతం వినిపిస్తున్న విమర్శలకు సమాధానం చెప్పవచ్చు.పవన్ కల్యాణ్‌కు ఇప్పుడు అసలు పరీక్ష రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కోవడం కాదు.. ఆరోగ్యం, సినిమా, ప్రభుత్వం అనే మూడు బాధ్యతల మధ్య సరైన సమతుల్యత సాధించడమే.

# టీడీపీ సోషల్ మీడియా టాస్క్ - టార్గెట్ జెన్ జీ, ఆల్ఫా

ఒంగోలు, : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ పాలనతో పాటు ప్రజలతో సమాచార సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. ముఖ్యంగా యువతను చేరుకోవడానికి సోషల్ మీడియాను సమర్థంగా ఉపయోగించుకోవాలని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు సూచించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం యువతలో వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి డిజిటల్ వేదికలకు ఉన్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వారికి చేరువ చేయాలన్నది ఆయన ఆలోచనగా కనిపిస్తోంది.ఇటీవలి కాలంలో రాజకీయ పార్టీలకు సోషల్ మీడియా ఎంత కీలకంగా మారిందో పలు పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా యువతలో రాజకీయ చర్చలు ఎక్కువగా డిజిటల్ వేదికలపైనే జరుగుతున్నాయి. ఒక అంశంపై ప్రజాభిప్రాయాన్ని వేగంగా ప్రభావితం చేయడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను నేరుగా ప్రజలకు వివరించేందుకు కూడా సోషల్ మీడియా ఉపయోగపడుతోంది. ఈ మార్పును గుర్తించిన బీజేపీ కూడా డిజిటల్ ప్రచారంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతోంది.ఇదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోనూ కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా వ్యవస్థను మరింత చురుగ్గా మార్చాలని భావిస్తున్నట్లు సమాచారం. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో కొంతమంది మంత్రుల డిజిటల్ కార్యకలాపాలపై చంద్రబాబు వివరాలు తెలుసుకున్నట్లు తెలుస్తోంది. నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వంగలపూడి అనిత , ఫరూక్ , కొండపల్లి శ్రీనివాస్ (తదితరులు తమ కార్యక్రమాలు, ప్రజా సంబంధిత విషయాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారని చర్చ జరిగింది.అయితే ఇంతటితో సరిపోదని చంద్రబాబు భావిస్తున్నట్లు సమాచారం. ప్రతి మంత్రి, ఎమ్మెల్యే, ఎంపీ తమ నియోజకవర్గాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలతో నిర్వహిస్తున్న సమావేశాలు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను డిజిటల్ మాధ్యమాల ద్వారా వివరించాలని సూచించినట్లు తెలుస్తోంది. ఒకే వేదికకు పరిమితం కాకుండా ప్రజలు ఎక్కువగా ఉపయోగించే అన్ని సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన చెప్పినట్లు సమాచారం.ముఖ్యంగా వచ్చే రెండేళ్లలో యువ ఓటర్ల ప్రాధాన్యం మరింత పెరగనుందని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువతకు ప్రభుత్వం ఏం చేస్తోంది, ఉపాధి, విద్య, పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో ఎలాంటి అవకాశాలు కల్పిస్తోంది అనే విషయాలను వారికి సులభంగా అర్థమయ్యే విధంగా చెప్పాల్సిన అవసరం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన 'జగన్ 2.0' యాప్ కూడా చర్చకు వచ్చినట్లు సమాచారం. డిజిటల్ వేదికల ద్వారా ప్రజలతో నిరంతర సంబంధం కొనసాగించే విషయంలో రాజకీయ నాయకులు మరింత ముందుండాలని చంద్రబాబు సూచించినట్లు తెలుస్తోంది. ప్రజలు ప్రశ్నిస్తే స్పందించడం, సమస్యలను గుర్తించి పరిష్కరించడం, చేసిన పనులను పారదర్శకంగా వివరించడం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది.అయితే సోషల్ మీడియాపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రధాన మీడియాకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాలని చంద్రబాబు సూచించినట్లు సమాచారం. టెలివిజన్, పత్రికలు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా.. అన్ని వేదికలను సమన్వయంతో ఉపయోగించినప్పుడే ప్రభుత్వ సందేశం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్తుందని భావిస్తున్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వం డిజిటల్ కమ్యూనికేషన్‌ను మరింత బలోపేతం చేసి యువతతో ప్రత్యక్ష సంబంధం పెంచుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది

# లోకల్ ఎన్నికలు కొంపముంచాతాయా ఏంటి



నెల్లూరు, : ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికి ప్రతిష్టాత్మకంతో పాటు ఎంతో సవాల్‌గా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు గ్రామం నుంచి మున్సిపల్ స్థాయి వరకు పార్టీ యంత్రాగాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి రెండేళ్లు కావస్తుంది. కార్యకర్తల్లో ఎన్నికలకు ముందు ఉత్సాహం లేదు. పదవులు లేవు. వారికి సరైన పనులు దక్కడం లేదు. ఇప్పటికీ అనేక నియోజకవర్గాల్లో వైసీపీ నేతలదే పెత్తనమని కార్యకర్తల నుంచి ద్వితీయ శ్రేణి నేతల వరకూ భావిస్తున్నారు. వీరు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కమిట్ మెంట్ తో పనిచేస్తారన్నది మాత్రం లోలోపల పార్టీ నేతలకు కూడా సందేహంగానే కనిపిస్తుంది.. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాకముందు ఒకలా... వచ్చిన తర్వాత మరొకలా వ్యవహరిస్తుంది. గత సాధారణ ఎన్నికల్లో ప్రాణాలకు తెగించి పోలింగ్ కేంద్రాల వద్ద కార్యకర్తలు పోరాడారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత మాత్రం పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలను పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా పార్టీ అగ్రనాయకత్వం హెచ్చరికలు చేస్తున్నా అత్యధిక సంఖ్యలో ఉన్న టీడీపీ శాసనసభ్యులు తమకు ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చే వారికే పనులు కట్టబెడుతున్నారు కానీ, పార్టీ కోసం పనిచేసిన కార్యకర్తల కష్టాన్ని మాత్రం గుర్తించడం లేదన్న అభిప్రాయం ఉంది. అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ఒరిగిన ప్రయోజనమేమీ లేదని బహిరంగంగానే పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా ద్వారా వాపోతున్నారు. కానీ వారి గోడును మాత్రం పట్టించుకోవడం లేదు. కూటమి నేతల మధ్య సయోధ్య లేకపోవడం కూడా మరొక తలనొప్పిగా తయారు కావచ్చు.. మరొకవైపు ఎమ్మెల్యేల అవినీతి, అక్రమాలను కూడా చూసీ చూడనట్లు పార్టీ నాయకత్వం వదిలేస్తుండటాన్ని కార్యకర్తలు ఆగ్రహంతో ఉన్నారు. టీడీపీకి బూత్ లెవెల్ లో భారీ బలగం ఉన్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంత మేరకు కసి తీరా పనిచేస్తుందన్నది మాత్రం సందేహంగానే ఉంది. మరొకవైపు ప్రత్యక్ష ఎన్నికల విధానం కూడా పార్టీకి నష్టం తెచ్చి పెడుతుందని అంటున్నారు. బీసీ నినాదం ఎత్తుకున్నా అవి న్యాయస్థానాలు ఎంత మేరకు అంగీకరిస్తాయన్నది కూడా అనుమానమే. ఇప్పటికే రిజర్వేషన్లపై హైకోర్టు చేసిన వ్యాఖ్యలు చూస్తే 34 శాతం బీసీ రిజర్వేషన్లతో ఈ ఎన్నికలకు వెళ్లే అవకాశాలు కనిపించడం లే?. స్థానిక సంస్థల్లో 34శాతం బీసీ రిజర్వేషన్ల అమలును ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రాకుండా ఎన్నికలు నిర్వహించడం ప్రభుత్వానికి పెద్ద సవాల్. అయితే 16వ ఆర్థిక సంఘం నిధులను పొందడానికి, సకాలంలో స్థానిక సంస్థల పాలనను పునరుద్ధరించడం కోసం ఎన్నికలు నిర్వహించడం అవసరం. అందుకే స్థానిక సంస్థల ఎన్నికలు టీడీపీకి ఛాలెంజ్ అనే చెప్పాలి.

# ఇంటి వద్దకే బస్సు..!




విజయవాడ: ప్రయాణికుల కోసం ఏపీఎస్ఆర్టీసీ మరో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టనుంది. ఇంటి వద్దే పికప్ సౌకర్యం కల్పించే ఆలోచన చేస్తోంది. పదిమందికిపైగా బల్క్ బుకింగ్ చేసుకుంటే వారి ఇంటి వద్దకే బస్సును పంపించే ఆలోచన చేస్తోంది. అయితే దూరప్రాంతాలకు వెళ్లే హైయ్యెండ్ బస్సు సర్వీసులలోనే ఈ విధానం అమలు చేయనున్నారు. అది కూడా విజయవాడ నగర పరిధిలో మాత్రమే ఈ విధానం అమలు చేసేందుకు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఏపీఎస్ఆర్టీసీ ఎప్పటికప్పుడు కొత్త చర్యలు చేపడుతూ వస్తోంది. ప్రయాణికుల ఆదరణ చూరగొనేందుకు కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే విజయవాడ రీజియన్ ఆర్టీసీ అధికారులు ఓ సరికొత్త విధానాన్ని అనుసరించనున్నారు. ప్రయాణికుల ఇంటి వద్దకే బస్సు పికప్ సదుపాయాన్ని కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అయితే ఇవి కేవలం కొన్ని బస్సులకే అమలు చేయనున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ అగ్రశ్రేణి బస్సులలో పదిమందికి పైగా ప్రయాణికులు తమ టికెట్లను బల్క్‌గా బుక్ చేసుకుంటే.. ఆర్టీసీ అధికారులు ఇంటి వద్దకే పికప్ కోసం బస్సును పంపించే ఆలోచన చేస్తున్నారు.మరోవైపు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన సూపర్ లగ్జరీ, ఏసీ, స్లీపర్ వంటి బస్సులు దూరప్రాంతాలకు సేవలు అందిస్తుంటాయి. ఈ బస్సులలో ప్రయాణించేందుకు మనమంతా ముందుగానే టికెట్లు బుక్ చేసుకుంటూ ఉంటాయి. అందులో నిర్దేశించిన సమయానికి బస్టాండ్ వద్దకు చేరుకుంటూ ఉంటాం. అయితే లగేజీ ఎక్కువగా ఉన్న సమయంలో బస్సులు ఆగే చోటకు చేరుకోవడం ఒక్కొక్కసారి ఇబ్బందిగా మారుతూ ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు ఏపీఎస్ఆర్టీసీ అధికారులు ఈ ఇంటి వద్దే బస్ పికప్ ఆలోచన చేస్తున్నారు. ప్రయాణికులు బల్క్‌గా టికెట్లు బుక్ చేసుకున్న సమయంలో.. వారిని ఇంటి వద్ద నుంచే పికప్ చేసుకునే సౌకర్యం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు.అయితే రాష్ట్రవ్యాప్తంగా కాకుండా తొలుత ప్రయోగాత్మకంగా విజయవాడ నగర పరిధిలోనే ఈ ఇంటి వద్దే పికప్ విధానాన్ని అమలు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా హైయ్యెండ్ శ్రేణిలో ఉన్న అన్ని ఏపీఎస్ఆర్టీసీ బస్సులను ప్రయాణికుల ఇళ్ల వద్దకు పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎవరైతే పదికి పైగా బల్క్‌గా టికెట్లు బుక్ చేసుకుంటారో ఆ ప్రయాణికులు.. తమ బుకింగ్ సమాచారాన్ని ముందుగా ఆర్టీసీ అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఇక ఈ విధానాన్ని అమలు చేసేందుకు గానూ త్వరలోనే కొత్త వ్యవస్థను అమల్లోకి తెచ్చేందుకు విజయవాడ ఏపీఎస్ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు త్వరలోనే పూర్తిగా వెల్లడికానున్నాయి

# మూడు మేయర్ సీట్లపై కమలం పార్టీకి పట్టు..



విశాఖపట్టణం, : ఇటు టీడీపీ. ఇటు జనసేన. కూటమిలోని ఈ రెండు పార్టీలు.. స్థానిక ఎన్నికలపై ఎవరి లెక్కల్లో వారు బిజీగా ఉన్నారు. బీజేపీ కూడా సైలెంట్‌గా ఉంటూనే పకడ్బందీ ప్లానింగ్స్ చేస్తోందట. కార్పొరేషన్ ఎన్నికల్లో డైరెక్ట్ ఫైట్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాలకు పదును పెడుతోందట కమలం పార్టీ. విశాఖ మేయర్ పీఠంపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టిందట. ఏపీ నగర పాలక సంస్థల్లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అతిపెద్దది. 125 డివిజన్ల డీలిమిటేషన్ ప్రాసెస్ కూడా జరగబోతోంది. విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లాలో విస్తరించి ఉంది. అందుకే ఇక్కడ మేయర్ పీఠం అంటే దాదాపు క్యాబినెట్ మంత్రితో సమానం అన్నట్లుగా భావిస్తున్నారు.ఆంధ్ర ప్రదేశ్ వార్తలుఏడాదికి ఐదారు వేల కోట్ల బడ్జెట్ ఉండే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పీఠం అంటే చాలా పెద్ద పదవి అనే చెప్పొచ్చు. ప్రత్యక్ష ఎన్నికలు జరగబోతుండటంతో తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించాలని మూడు పార్టీలు ఆశిస్తున్నాయి. బీజేపీ ఈ మేయర్ పీఠాన్ని తమకు విడిచి పెట్టాలని కోరాలని డిసైడ్ అయిందట.1979లో కాంగ్రెస్ పార్టీతో పోటీపడి మరీ ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని సొంతం చేసుకుంది బీజేపీ. అప్పుడు జనసంఘ్ రూపంలో ఉన్న బీజేపీ.. తొలిసారి విశాఖ మేయర్ అభ్యర్థిని గెలిపించుకొని హిస్టరీ క్రియేట్ చేసింది. ఇప్పటికీ విశాఖ నగరంలో బీజేపీకి మంచి పట్టు ఉన్నట్లు చెబుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ ఎంపీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం నడిచింది. కాని పొత్తుల్లో భాగంగా పక్కనున్న అనకాపల్లి స్థానం బీజేపీకి దక్కగా.. అక్కడి నుంచి కమలం పార్టీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ గెలిచారు. విశాఖ గ్రేటర్ పరిధి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా కొంత విస్తరించి ఉంటుంది. దీంతో తమకు గ్రేటర్ పీఠం ఇస్తే ఈజీగా గెలుచుకోవచ్చనే అంచనాల్లో ఉందట కమలం పార్టీ. సేఫ్‌సైడ్ గత ఎన్నికల్లో తమకు విశాఖ ఎంపీ సీటు ఇవ్వకపోవడంతో.. ఇప్పుడు మేయర్ పీఠం అయినా వదిలేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారు బీజేపీ నేతలు.విశాఖ మేయర్ సీటుతో పాటు.. విజయవాడ, తిరుపతి నగర పాలక సంస్థలపై కూడా బీజేపీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గ్రేటర్ విశాఖ పరిధిలో బీజేపీకి ఓ ఎమ్మెల్యే, మరో ఎంపీ ఉన్నారు. 2014లో కూడా విశాఖ ఎంపీ సీటును బీజేపీ గెలిచింది. దీంతో తమకు పట్టున్న చోట మేయర్ సీటు దక్కించుకొని.. ఇంకా బలం పెంచుకునే ప్లాన్‌లో ఉన్నారట కమలనాథులు. ఇక గత ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సీటును గెలుచుకున్న బీజేపీ.. బెజవాడ మేయర్ సీటుకోసం పట్టుబట్టేందుకు రెడీ అవుతోందట. తిరుపతి మేయర్ స్థానం కూడా తమకే ఇవ్వాలని కోరబోతోందట. కూటమి పెద్దల భేటీలో తమ వాదనను బలంగా వినిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. స్టేట్ మొత్తంలో అర్బన్ ఏరియాల్లో తమ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవుల్లో పార్టీకి తగిన ప్రాధాన్యం దక్కేలా సీట్ల సర్దుబాట్లపై దృష్టి పెట్టాలని బీజేపీ డిసైడ్ అయిందట.రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవుల పంపకంపై ఇప్పటి నుంచే రాజకీయ చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా విశాఖతో పాటు విజయవాడ, తిరుపతి నగరాలు రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మికంగా కీలకమైనవి కావడంతో ఇక్కడ మేయర్ పీఠాలను దక్కించుకుంటే పార్టీకి సంస్థాగతంగా, రాజకీయంగా మరింత ప్రయోజనం ఉంటుందని బీజేపీ అంచనా వేస్తోందట.పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, స్థానిక బలాబలాలు వంటి సమీకరణలు మేయర్ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రలో తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని బీజేపీ నేతలు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌పై ఒత్తిడి తెస్తున్నారట. అసెంబ్లీ ఎన్నికల్లో సర్దుబాట్ల కోసం ఫాలో అయిన విధానం కాకుండా.. ఇప్పుడు స్థానికంగా పార్టీల బలం, అభ్యర్థుల సామర్థ్యం, వార్డుల వారీగా సమీకరణాలను లెక్కలులోకి తీసుకోవాల్సి ఉంటుంది. విశాఖ, విజయవాడ, తిరుపతి మేయర్ పీఠాల కోసం బీజేపీ పట్టుబడితే.. కూటమిలోని టీడీపీ, జనసేన నుంచి స్పందన ఎలా ఉంటుందో.. కమలం పార్టీ ఆశించినట్లు మేయర్ సీట్లు దక్కుతాయో లేదో చూడాలి మరి.

# 25 ఇండస్ట్రియల్ పార్కులకు లైన్ క్లియర్

అనంతపురం : కేంద్రం భవ్య పథకం కింద దేశవ్యాప్తంగా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా తొలి దశలో దేశవ్యాప్తంగా 20 పార్కుల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానించగా ఏపీఐఐసీ ఆరింటికి ప్రతిపాదనలు పలికింది. అయితే రెండు పార్కులకు మాత్రమే కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. దాంతో రెండో దశలో 16 చోట్ల పార్కుల అభివృద్ధికి వీలుగా ఏపీఐఐసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ 22తో పాటు మరో మూడు పార్కులను కూడా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. దాని కోసమే ఇప్పుడు 25 పార్కులకు 20 ఎకరాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది.కూటమి ప్రభుత్వం పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త కళ సంతరించుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలైనా, కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలైనా.. అభివృద్ధి చర్యలైనా ఆంధ్రప్రదేశ్ వరకూ వస్తున్నాయి. ఏపీలోని అధికారిక కూటమి ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామ్యం కావడంతో దేశ వ్యాప్తంగా భవ్య పథకం కింద అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక పార్కుల్లో ఏపీకి కూడా అవకాశం కల్పించారు. రాష్ట్రంలో 25 భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ సంకల్పించింది. మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ పథకాల కింద కేంద్ర నిధులను వినియోగించుకోవాలని భావిస్తోంది. భవ్య కింద 22 పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ 22తో పాటు రాష్ట్రంలో ఏర్పాటయ్యే భారీ ప్రాజెక్టులకు అనుసంధానంగా శ్రీకాకుళం, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో కొత్తగా పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీని కోసం ఇప్పటికే 12 వేల ఎకరాలు సేకరించింది. కొత్తగా జాబితాలో చేరిన మూడు పార్క్‌ల కోసం మరో 8 వేల ఎకరాల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది.భవ్య పథకం కింద రూ. 33,600 కోట్లతో దేశ వ్యాప్తంగా వంద పార్కులు అభివృద్ధి చేయాలన్నది కేంద్రం ప్రతిపాదన. ఇందులో మొదటగా 20 పార్కుల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానించగా.. రాష్ట్రం నుంచి ఆరింటికి ఏపీఐఐసీ ప్రతిపాదనలు పంపింది. అందులో కేవలం రెండింటికి మాత్రం కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రెండో దశలో 80 పార్కుల కోసం కేంద్రం దరఖాస్తులు ఆహ్వానించగా.. ఈ సారి 16 చోట్ల పార్కుల అభివృద్ధికి వీలుగా ఏపీఐఐసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.ప్రస్తుతానికి పారిశ్రామిక పార్కుల్లో మౌలిక సదుపాయాల కోసం ఎకరాకు రూ. కోటి చొప్పున కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది. ఈపథకం కింద పార్కుల అభివృద్ధికి 90 శాతం భూములు సేకరించాలన్న

నిబంధన ఉండటంతో ఇప్పటికే ఏపీఐఐసీ 22 పార్కులకు 12 వేల ఎకరాలను సేకరించింది. ఈ 22తో పాటు మరో మూడు పార్కుల అభివృద్ధికి కూడా ఏపీఐఐసీ ప్రతిపాదనలు రూపొందించడం విశేషం. శ్రీకాకుళం జిల్లా మూలపేట, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న మూడు పార్క్‌ల ద్వారా మరో 8 వేల ఎకరాలను పారిశ్రామిక అవసరాల కోసం అందుబాటులోకి తేవాలని ఏపీఐఐసీ భావిస్తోంది.

# వైసీపీలో 'సజ్జల-బొత్స' కల్లోలం




గుంటూరు: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై బాంబు వేశారు విజయసాయిరెడ్డి. తనను నమ్మకద్రోహి అంటూ విమర్శించడానికి తట్టుకోలేక 2 పేజీల బహిరంగ లేఖను విడుదల చేశారు. ప్రధానంగా సజ్జల రామకృష్ణారెడ్డిని టార్గెట్ చేసుకున్నారు. ఆయనకంటే ఇంకా నమ్మకద్రోహి ఎవరు ఉంటారు అంటూ.. పార్టీలో తనకు జరిగిన అన్యాయాన్ని, అవమానాలను ఏకరువు పెడుతూ తన ఆవేదనను బయటపెట్టారు. అయితే మధ్యలో ఉత్తరాంధ్రకు చెందిన మాజీ మంత్రి అంటూ పరోక్షంగా బొత్స సత్యనారాయణ ప్రస్తావన తీసుకొచ్చారు. త్వరలో పార్టీ మారబోతున్న ఓ మాజీ మంత్రి అంటూ అభివర్ణించారు. బొత్సతో కలిసి సజ్జల రామకృష్ణారెడ్డి తనపై కుట్ర చేసి.. ఉత్తరాంధ్ర సమన్వయకర్త పదవి నుంచి తొలగించారని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు రెండు విషయాల్లో క్లారిటీ ఇచ్చారు విజయసాయిరెడ్డి. సజ్జల రామకృష్ణారెడ్డి టిడిపి కోవర్టుగా పనిచేస్తున్నారని ఒకవైపు.. బొత్స సత్యనారాయణ పార్టీ మారబోతున్నారు అని క్లారిటీ ఇచ్చారు. ఈ రెండు అంశాలు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన నింపుతున్నాయి.విజయసాయిరెడ్డి లాజిక్ తో కొట్టారు. నమ్మకద్రోహి అయి ఉంటే నాడు కాంగ్రెస్ పార్టీతో రాజీ పడే వాడినని.. జగన్మోహన్ రెడ్డితో కేసులు పడేవాడిని కాదు అంటూ.. పార్టీ ఏర్పాటుకు ముందు నుంచే తాను జగన్మోహన్ రెడ్డికి నమ్మిన బంటు అని చెప్పే ప్రయత్నం చేశారు. మరోవైపు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సజ్జల రామకృష్ణారెడ్డి పై ఒక్క ఛార్జ్ షీట్ దాఖలు కాని విషయాన్ని ప్రస్తావించి.. టిడిపి తో కుమ్మక్కు అయ్యారని చెప్పేందుకు ఇంతకంటే మంచి ఉదాహరణ ఏముంటుందని చెప్పే ప్రయత్నం చేశారు. దానిపై కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆలోచన మొదలైంది. సజ్జల రామకృష్ణారెడ్డి తీరు వల్ల పార్టీకి డ్యామేజ్ జరుగుతుందనే క్యాడర్ అభిప్రాయానికి మరింత బలం చేకూరింది.మరోవైపు బొత్స సత్యనారాయణ పార్టీ మారే అవకాశం ఉన్నట్లు ఇటీవల ప్రచారం నడిచింది. కుటుంబ అవసరాల రిత్యా ఆయన జనసేనలో చేరుతారన్న టాక్ కూడా ఉంది. కానీ ఇంతవరకు ఆ ప్రచారాన్ని ఖండించలేదు బొత్స. ఇప్పుడు విజయసాయిరెడ్డి ఆ ప్రస్తావన తీసుకొచ్చేసరికి ప్రాథమికంగా ఏదో జరిగిందన్న అనుమానం ఉంది. అయితే బొత్స కు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యత దృష్ట్యా ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారని మెజారిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. ఉత్త ప్రచారం అని తేల్చేసాయి. కానీ ఇప్పుడు విజయస్సాయిరెడ్డి బొత్స విషయంలో బాంబు పేల్చారు. ఆయన పార్టీ మారబోతున్నట్లు ప్రస్తావన తీసుకొచ్చారు. ఒకవైపు సజ్జల టిడిపి కోవర్టుగా పనిచేస్తున్నారని ఒకవైపు.. బొత్స పార్టీ మారబోతున్నారన్న విషయం ఒక వైపు.. వైసీపీలో కల్లోలం రేపుతోంది.

సజ్జల నన్ను కొట్టాడు

సోనియా గాంధీని ఎదిరించి పార్టీ పెట్టిన తర్వాత.. వైయస్ జగన్మోహన్ రెడ్డికి అన్ని తనై నడిపించారు విజయసాయిరెడ్డి. జగన్ కంపెనీలలోకి ప్రవహించిన పెట్టుబడులు.. ఆయన స్థాపించిన సంస్థలు.. సంపాదించిన ఆస్తులు.. వీటన్నిటిని పర్యవేక్షించారు విజయసాయిరెడ్డి. అప్పట్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులు పెట్టినప్పుడు.. కేంద్ర దర్యాప్తు సంస్థలకు దొరకకుండా జగన్ స్థాపించిన కంపెనీల వ్యవహారాలను.. లోగోట్టును బయటపడకుండా చూశారు విజయసాయిరెడ్డి. 2019 ఎన్నికల్లో జగన్ గెలవడంలో షర్మిల ఎంతైతే పాత్ర పోషించారు.. అంతకుమించిన స్థాయి పాత్రను విజయసాయిరెడ్డి పోషించారు. నాడు రాజ్యసభ సభ్యుడిగా విజయ సాయి రెడ్డి ఉండేవారు. ఎప్పుడైతే సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ కోటరీలో చేరిపోయారో అప్పుడే పరిస్థితి మారిపోయింది. విజయసాయి రెడ్డి ప్రభ మసకబారడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే విజయసాయిరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి చేతిలో భౌతిక దాడికి గురయ్యారు. ఆ సమయంలో జగన్ పక్కనే ఉన్నప్పటికీ కనీసం మాట కూడా మాట్లాడలేదు. దీనికి తోడు అన్ని బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని తప్పించారు. దీంతో తట్టుకోలేక విజయసాయిరెడ్డి బయటికి వచ్చేసారు. పార్టీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా వదులుకున్నారు.పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత విజయసాయిరెడ్డి అసలు విషయాలను బయటపెడుతున్నారు.. మద్యం కుంభకోణం.. ఇతర అక్రమాలను ఆయన మీడియా ముందు ఉంచుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా విజయసాయిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. నాడు పార్టీలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను.. అవమానాలను ఆయన బయటపెట్టారు. 2022లో వైసీపీ ప్లీనరీలో అందరి ముందు విజయసాయి రెడ్డి పై సజ్జల రామకృష్ణారెడ్డి భౌతిక దాడి చేశారు. నాడు జగన్ ప్రత్యేక పాత్రకే పరిమితమయ్యారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. అన్ని బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని జగన్ తప్పించారు. అంతేకాదు నాటి సజ్జల కేవలం ఎమ్మెల్యేలు ఎంపీలకు మాత్రమే కాకుండా మంత్రులకు కూడా జగన్ అపాయింట్మెంట్ లభించకుండా చేశారట. అందువల్లే వైసీపీ ఓడిపోయిందట. ఇప్పుడు టిడిపి కూటమితో సజ్జల రాజీ పడ్డారట. అందువల్లే నమోదైన కేసులలో ఆయన పేరు మీద చార్జిషీట్ ఏర్పాటు చేయలేదట. అంతేకాదు సజ్జల వల్ల జగన్ తన కుటుంబానికి దూరమయ్యారట. ఒకవేళ 2029 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి ఓటమి ఎదురైతే అది ముమ్మాటికి సజ్జల వల్లేనని విజయసాయి రెడ్డి ఆరోపించారు. మొత్తానికి విజయసాయిరెడ్డి మరోసారి వైసీపీలో ఉన్న అసలు వ్యవహారాలను బయట పెట్టడంతో.. ఇప్పుడు ఆ పార్టీ నేతలకు మాట్లాడే అవకాశం లేకుండా పోతుంది. సరిగా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు వైసీపీలో జరుగుతున్న వ్యవహారాలను విజయసాయిరెడ్డి బయట పెట్టడంతో.. ఆ పార్టీకి ఉక్కపోత ఎదురవుతోంది.

# ఏపీలో స్థానిక ఎన్నికలు.. చంద్రబాబు బాటలో జగన్




కడప : వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేశారు. ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అటువంటి చోట నియోజకవర్గ ఇన్చార్జి లకు టికెట్లు ఇవ్వనని తేల్చి చెప్పారు. కానీ ఈ ప్రకటన వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. కచ్చితంగా ఈ ప్రకటనతో తెలుగుదేశం కూటమి ముందుగానే పావులు కదుపుతుంది. ముందుగా పులివెందుల నియోజకవర్గం పైనే ఫోకస్ పెడుతుంది. గత ఏడాది పులివెందుల జడ్పిటిసి స్థానం ఏ విధంగా పట్టుబట్టి గెలిచిందో.. కచ్చితంగా పులివెందుల మునిసిపాలిటీని సైతం అలాగే కైవసం చేసుకుంటుంది. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో ఒకరు మున్సిపల్ అభ్యర్థిగా వైసీపీ తరఫున బరిలో నిలుస్తారు. కానీ ఆ పార్టీకి కౌన్సిలర్ల అభ్యర్థులు మాత్రం దొరకరు. అంతలా ఉంటుంది టిడిపి వేట అక్కడ. ఇప్పటికే టిడిపి బృందం ఒకటి పులివెందులలో వాలిపోయింది. వారు వార్డుల్లో ఏకగ్రీవాలకు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయిపులివెందులలో ఏకగ్రీవాలు జరిగితే మాత్రం జగన్మోహన్ రెడ్డి నుంచి మరో ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఏకపక్షంగా గెలిచి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్థానం దక్కకపోతే మాత్రం జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా డిఫెన్స్ లో పడతారు. అయితే కీలక కూటమి నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో చాలా మున్సిపాలిటీలు ఏకగ్రీవాలు జరుగుతాయి. అది జగన్మోహన్ రెడ్డికి కూడా తెలుసు. ఒకవేళ ఏకగ్రీవాలు జరిగి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఓటమి ఎదురైతే.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తారు. ఇది జరిగే పని అంటూ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. 2021లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ముందుగా పంచాయితీల ఎన్నికలు జరిగాయి. తరువాత మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. కుప్పం నియోజకవర్గంలో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మొత్తం మోహరించింది. ఎలాగైనా మున్సిపాలిటీ ని కైవసం చేసుకోవాలని చూసింది. అయినా సరే టిడిపి శ్రేణులు ప్రతిఘటించాయి. కానీ ఫలితం లేకపోయింది. పరిమిత వార్డులకే టిడిపి పరిమితం అయింది. అంతకుముందు పంచాయతీ ఎన్నికల్లో సైతం ప్రలోభాలతో, భయపెట్టి మరి వైసీపీ సానుభూతిపరులు గెలిచారు. కేవలం కుప్పం ఫలితాలతో చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. అందుకే తరువాత వచ్చిన మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలను బహిష్కరించారు చంద్రబాబు. ఇప్పుడు కూడా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి అదే పరిస్థితి ఎదురైన మరుక్షణం.. తరువాత ఆ రెండు స్థానిక ఎన్నికలను జగన్మోహన్ రెడ్డి బహిష్కరిస్తారు. ఇది ఒక వ్యూహం అని తెలుస్తోంది. స్థానిక ఎన్నికలు బహిష్కరించిన చంద్రబాబు స్ట్రాటజీ అప్పట్లో చాలా విమర్శలకు తావిచ్చింది. కానీ సార్వత్రిక ఎన్నికల నాటికి ఆ ప్రయోగమే ఫలించింది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి సైతం అదే ఫార్ములాను అనుసరించనున్నారు.

# జొన్నగిరిలో వజ్రాల వేట



కర్నూలు : కర్నూలు జిల్లాలోని జొన్నగిరి ప్రాంతం వజ్రాల వేటకు ప్రసిద్ధి. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఇక్కడి ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారు వజ్రాల కోసం పొలాలు, పరిసర ప్రాంతాల్లో వెతుకులాట ప్రారంభిస్తారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసిన తర్వాత నేలపైకి కొట్టుకొచ్చే రాళ్లు, ఖనిజాల్లో వజ్రాలు దొరికే అవకాశం ఉందన్న నమ్మకంతో చాలామంది ఈ వేటకు వస్తుంటారు.జొన్నగిరి ప్రాంతంలో వర్షం కురిసిన తర్వాత పొలాల్లోని మట్టి కొట్టుకుపోయి, భూమి లోపలి పొరల్లో ఉన్న రాళ్లు బయటపడతాయి. దీంతో వజ్రాల కోసం వెతికేవారికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని స్థానికులు చెబుతుంటారు. వర్షం తగ్గిన వెంటనే కొందరు స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పొలాల్లోకి వెళ్లి నేలను జల్లెడ పడతారు. మెరుస్తున్న రాళ్లు కనిపిస్తే వాటిని సేకరించి పరీక్షించుకుంటారు. జొన్నగిరి ప్రాంతంలో గతంలో వజ్రాలు లభించాయన్న వార్తలు తరచూ వెలువడ్డాయి. కొందరికి విలువైన రాళ్లు దొరికాయని ప్రచారం జరగడంతో వర్షాకాలంలో వజ్రాల వేటపై ఆసక్తి మరింత పెరుగుతోంది. అయితే ప్రతి మెరిసే రాయి వజ్రం కాదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కనిపించే కొన్ని ఖనిజాలు కూడా వజ్రాల మాదిరిగా మెరుస్తుంటాయి. నిజంగా వజ్రమా కాదా అనేది నిపుణుల పరీక్షల ద్వారానే నిర్ధారించాల్సి ఉంటుంది.వజ్రం దొరికితే ఒక్కసారిగా తమ జీవితాలు మారిపోతాయన్న ఆశతో కొందరు వర్షం పడిన ప్రతిసారీ పొలాల్లోకి వెళ్తుంటారు. గంటల తరబడి నేలను పరిశీలిస్తూ రాళ్లను ఏరుకుంటారు. వర్షాకాలంలో జొన్నగిరి ప్రాంతంలో కనిపించే ఈ దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే వజ్రాల వేటకు వెళ్లేవారు స్థానిక నిబంధనలు, భూమి యజమానుల అనుమతులు, భద్రతా అంశాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. వర్షం పడితే జొన్నగిరిలో మొదలయ్యే ఈ వజ్రాల వేట.. అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంగా మారుతోంది.

# క్రెడిట్ కార్డును స్మార్ట్‌గా వాడటం ఎలా..?




ఇలా చేస్తే రూపాయి వడ్డీ కట్టాల్సిన పని ఉండదు..మధ్యతరగతి ఉద్యోగులకు క్రెడిట్ కార్డు అనేది ఎమర్జెన్సీ లైఫ్ లైన్ లాంటిది. ఈ మధ్య వీటి వాడకం విపరీతంగా పెరిగిపోయింది. ఎవరి జేబులో డబ్బులు లేకున్నా క్రెడిట్ కార్డు స్వైప్ చేయడం కామన్‌గా మారింది. అత్యవసర సమయాల్లో అపద్బాంవుడిగా మారుతున్నాయి. అయితే అధిక వడ్డీ రేట్లు పడతాయనే భయంతో చాలామంది వీటి వినియోగానికి వెనుకాడుతుంటారు. సరైన అవగాహనతో, ఆర్థిక క్రమశిక్షణతో వాడితే ఒక్క రూపాయి కూడా వడ్డీ చెల్లించకుండా క్రెడిట్ కార్డులను పూర్తి ప్రయోజనకరంగా మార్చుకోవచ్చు. అవును..

క్రెడిట్ కార్డు బిల్లింగ్ సైకిల్‌ను సరిగ్గా అర్థం చేసుకోవడమే ఇందులో ప్రధాన కిటుకు. బ్యాంకులు కార్డు స్వైప్ చేసిన తేదీని బట్టి దాదాపు 45 నుండి 50 రోజుల వరకు వడ్డీ రహిత గడువును అందిస్తాయి. బిల్లింగ్ తేదీని, డ్యూ డేట్‌ను దృష్టిలో ఉంచుకుని ఖర్చులు చేస్తే ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా బ్యాంక్ డబ్బును ఉపయోగించుకోవచ్చు. బిల్లు వచ్చిన తర్వాత గడువు తేదీలోపు మొత్తం బకాయిని పూర్తిగా చెల్లించేస్తే ఒక్క పైసా కూడా వడ్డీ పడదు. క్రెడిట్ కార్డు బిల్లులో ప్రధానంగా కనిపించే అంశం మినిమం అమౌంట్ డ్యూ. ఇది సాధారణంగా మొత్తం బిల్లులో 5 నుంచి 10 శాతం ఉంటుంది. కేవలం మినిమం బ్యాలెన్స్ మాత్రమే చెల్లిస్తే, మిగిలిన మొత్తం బకాయిపై బ్యాంకులు ఏటా 36 నుండి 45శాతం వరకు భారీ వడ్డీని వసూలు చేస్తాయి. బకాయి ఉండిపోతే, తదుపరి చేసే ప్రతి కొత్త కొనుగోలుపై మొదటి రోజు నుంచే వడ్డీ లెక్కించడం మొదలవుతుంది. కేవలం మినిమం అమౌంట్ మాత్రమే చెల్లిస్తూ పోతే అప్పుల భారం పెరిగి క్రెడిట్ స్కోర్ దెబ్బతినే ప్రమాదం ఉంది.

# సైబర్ దాడులపై సెబీ అలర్ట్....




స్టాక్ మార్కెట్లలో సైబర్ దాడులను అడ్డుకోవడంతో పాటు హెచ్చరికల వ్యవస్థను మరింత వేగవంతం చేయడానికి మార్కెట్ నియంత్రణ సంస్థ 'సెబీ' సోమవారం రెండు కొత్త డిజిటల్ పోర్టల్స్‌ను అందుబాటులోకి తెచ్చింది. సైబర్ సెక్యూరిటీ సంఘటనల రిపోర్టింగ్‌ను గ్లోబల్ ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతం చేస్తూ, 'ఇన్సిడెంట్ రిపోర్టింగ్ పోర్టల్'ను, సమాచారం, విధానపరమైన హెచ్చరికలను షేర్ చేయడానికి 'సైబర్ సురక్షా పోర్టల్'ను సెబీ ప్రారంభించింది. సెబీ సైబర్ డిఫెన్స్ సింపోజియంలో ఛైర్మన్ తుహిన్ కాంత పాండే మాట్లాడుతూ, కేవలం ఒకే సంస్థ భద్రతపై కాకుండా మొత్తం మార్కెట్ వ్యవస్థ సురక్షితంగా ఉందో లేదో చూడటమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. థర్డ్-పార్టీ వెండర్లు, టెక్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా సైబర్ ప్రమాదాలు ఇతర సంస్థలకు వ్యాపించే అవకాశం ఉన్నందున, నియంత్రణ నిబంధనల పాటించే కంపెనీలుగానే కాకుండా నిరంతరం రిస్క్‌ను పర్యవేక్షించే వైపు కంపెనీలు మారాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత వల్ల సైబర్ దాడులతో పాటు వాటిని అడ్డుకునే రక్షణ చర్యలు కూడా వేగవంతమయ్యాయని సెబీ తెలిపింది. సాఫ్ట్‌వేర్, క్లౌడ్ కాన్ఫిగరేషన్లలో ఉన్న బలహీనతలను నిరంతరం గుర్తిస్తూ వాటిని సరిదిద్దే వ్యవస్థను సంస్థలు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేసింది. అంతేకాకుండా, భవిష్యత్తులో క్వాంటం కంప్యూటింగ్ నుండి ఎదురయ్యే ముప్పును ముందే ఊహించి, 'పోస్ట్-క్వాంటం క్రిప్టోగ్రఫీ' ప్రాజెక్ట్‌లను అమలు చేయడం ద్వారా సైబర్ సెక్యూరిటీ వ్యూహంలో క్వాంటం రెజిలియెన్స్‌ను ఒక ప్రధాన స్తంభంగా మార్చాలని సెబీ నిర్ణయించింది.


# స్పైస్‌జెట్‌కు ఎన్‌సిఎల్‌టిలో ఎదురుదెబ్బ




తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విమానయాన సంస్థ స్పైస్‌జెట్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి)లో ఎదురుదెబ్బ తగిలింది. సంస్థపై దాఖలైన ఎనిమిది దివాలా పిటిషన్లపై తీర్పు వెలువరించాల్సిన రోజునే ఓ విమాన లీజు సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు ప్రకటించడంపై ఎన్‌సిఎల్‌టి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చివరి నిమిషంలో ఒప్పందం గురించి వెల్లడించడం కోర్టు సమయాన్ని వృథా చేయడమేనని వ్యాఖ్యానించింది. ఐబిసి సెక్షన్ 9 కింద స్పైస్‌జెట్ బకాయిల కోసం ఎనిమిది రుణదాత సంస్థలు 2024లో ఎన్‌సిఎల్‌టిలో పిటిషన్లు దాఖలు చేశాయి. సోమవారం తీర్పు వెలువడాల్సి ఉండగా.. పిటిషనర్లలో ఒకటైన ఏవియేటర్ ఎంఎల్ 29641 లిమిటెడ్‌తో రాజీ ఒప్పందం కుదుర్చుకున్నామని, తొలి విడతగా 5 లక్షల డాలర్లు (సుమారు రూ.4.2 కోట్లు) చెల్లించామని స్పైస్‌జెట్ తెలిపింది. దీనిపై స్పందించిన బెంచ్.. రాజీ విషయాన్ని ఇంతకాలం ఎందుకు వెల్లడించలేదని ప్రశ్నించింది. మిగిలిన ఏడుగురు రుణదాతల న్యాయవాదులు కూడా స్పైస్‌జెట్ తీరును తప్పుపట్టారు. ఒక్క సంస్థతో ఒప్పందం చేసుకుని మిగిలిన పిటిషన్లపై విచారణను జాప్యం చేయడం సరికాదని, తమ కేసుల్లో వెంటనే తీర్పు ఇవ్వాలని కోరారు.

అయితే బకాయిలపై స్పష్టత ఇచ్చేందుకు స్పైస్‌జెట్‌కు సమయం ఇచ్చిన ఎన్‌సిఎల్‌టి తీర్పును బుధవారానికి వాయిదా వేసింది. మరోవైపు స్పైస్‌జెట్ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. 2025 డిసెంబరు 31తో ముగిసిన తొలి తొమ్మిది నెలల్లో సంస్థ నికర నష్టం రూ.1,138.15 కోట్లకు చేరగా, కార్యకలాపాల ఆదాయం 14 శాతం తగ్గి రూ.3,271.5 కోట్లకు పరిమితమైంది. మార్కెట్ వాటా 3.9 శాతం నుంచి 1.9 శాతానికి పరిమితమయ్యింది. ఈ ఏడాది ఇప్పటివరకు స్పైస్‌జెట్ షేరు సుమారు 61 శాతం పతనమయ్యింది.

# ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జీడీపీ 7 శాతమేనన్న ఇక్రా...




భారత ఆర్థికవ్యవస్థ వృద్ధి రేటుకు బ్రేకులు పడే సూచనలు కనిపిస్తున్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ 'ఇక్రా' అభిప్రాయపడింది. తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి గతంలో కంటే తగ్గనుంది. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి పరిమితం కానుందని ఇక్రా అంచనా వేసింది. గత మార్చి త్రైమాసికంలో నమోదైన 7.8 శాతంతో పోలిస్తే ఇది తగ్గడమే కాకుండా, గత నాలుగు త్రైమాసికాలలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సేవా రంగంలో వేగం తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ జూన్ త్రైమాసికంలో పారిశ్రామిక రంగం 7.7 శాతం, సేవా రంగం 7.9 శాతం, వ్యవసాయ రంగం 4 శాతం మేర వృద్ధి నమోదు చేయనున్నాయి. పశ్చిమాసియా సంక్షోభం మరింత ముదరడం, రుతుపవనాలపై అనిశ్చితి కొనసాగితే వృద్ధి అంచనాలకు మరింత డౌన్‌సైడ్ రిస్క్ ఉంటుందని నాయర్ పేర్కొన్నారు. మొత్తం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత జీడీపీ వృద్ధి రేటు గత ఏడాది నమోదైన 7.7 శాతం నుండి 6.7 శాతానికి తగ్గవచ్చని ఇక్రా భావిస్తోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వల్ల ముడి సరుకుల ధరలు పెరిగినప్పటికీ, మన దేశంలో పారిశ్రామిక, సేవా రంగాల వ్యాపార పరిమాణం ఇప్పటికీ ఆశాజనకంగానే ఉందని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ స్పష్టం చేశారు.

'ఇక్రా' అభిప్రాయపడింది. తాజా గణాంకాల ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో దేశ జీడీపీ వృద్ధి గతంలో కంటే తగ్గనుంది. ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత జీడీపీ వృద్ధి రేటు 7 శాతానికి పరిమితం కానుందని ఇక్రా అంచనా వేసింది. గత మార్చి త్రైమాసికంలో నమోదైన 7.8 శాతంతో పోలిస్తే ఇది తగ్గడమే కాకుండా, గత నాలుగు త్రైమాసికాలలోనే అత్యంత కనిష్ట స్థాయి కావడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థకు కీలకమైన సేవా రంగంలో వేగం తగ్గడమే ఇందుకు ప్రధాన కారణం.పశ్చిమాసియా సంక్షోభం మరింత ముదరడం, రుతుపవనాలపై అనిశ్చితి కొనసాగితే వృద్ధి అంచనాలకు మరింత డౌన్‌సైడ్ రిస్క్ ఉంటుందని నాయర్ పేర్కొన్నారు. మొత్తం 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత జీడీపీ వృద్ధి రేటు గత ఏడాది నమోదైన 7.7 శాతం నుండి 6.7 శాతానికి తగ్గవచ్చని ఇక్రా భావిస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం, పెరిగిన ఇంధన ధరలు, వేతన ఖర్చుల భారం సేవా రంగాన్ని దెబ్బతీశాయని, దీనివల్ల ఈ రంగంలోని కంపెనీల సానుకూల ధోరణి గత ఐదేళ్లలోనే అత్యంత దిగువకు చేరిందని తెలిపింది.

# సరిహద్దుల్లో శత్రు డ్రోన్ల కట్టడి ఇంద్రజాల్‌కు రూ.155 కోట్ల ఆర్డర్లు.....




హైదరాబాద్ కేంద్రంగా కార్యకాలాపాలు నిర్వహిస్తున్న ఇంద్రజాల్ అటానమస్ డిఫెన్స్ సిస్టమ్స్, కేంద్ర హోం శాఖ నుంచి రూ.155 కోట్ల విలువైన ఆర్డర్లు దక్కించుకుంది. సరిహద్దు గ్రామాలు, పట్టణ వీధులు, అత్యంత ప్రముఖులు ప్రయాణించే మార్గాల్లో ప్రమాదకర డ్రోన్ల ముప్పును అరికట్టేందుకు ఇంద్రజాల్ రేంజర్ వాహనాలను మోహరించనున్నారు.

ఇందులో సరిహద్దు రక్షణ కోసమే రూ.145 కోట్లు కేటాయించారు. ఇంద్రజాల్-సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కలిసి ఈ ప్రాజెక్టు పూర్తి చేయనున్నాయి. మిగిలిన రూ.10 కోట్లతో పట్టణ పోలీసులు వీవీఐపీ రక్షణ, విమానాశ్రయాలు, బహిరంగ సభల వద్ద భద్రత కోసం రేంజర్ వాహనాలను వినియోగిస్తారు.

సరిహద్దుల్లో మాదకద్రవ్యాలు, ఆయుధాల అక్రమ రవాణాను అడ్డుకోవడంలో ఇవి కీలకం కానున్నాయి. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలు సైనిక స్థావరాలకే ఇలాంటి వ్యవస్థలను పరిమితం చేయగా, భారత్ పౌర భద్రత కోసం వీటిని ప్రవేశపెడుతున్నట్లు ఇంద్రజాల్ వ్యవస్థాపకులు కిరణ్ రాజు పెనుమత్స తెలిపారు. స్వదేశీ పరిజ్ఞానంతో వీటిని రూపొందించడం ఆత్మ నిర్భర్ భారత్ దిశగా కీలక అడుగు అని సిగ్మా సీఈఓ సునీల్ కలిదిండి పేర్కొన్నారు.

# యుపిఐ లావాదేవీల్లో సరికొత్త రికార్డు





న్యూఢిల్లీ : దేశంలో యుపిఐ లావాదేవీల జోరు కొనసాగుతూ... తాజాగా అది సరికొత్త రికార్డును సృష్టించింది. జులైలో రూ.29.88లక్షల కోట్ల లావాదేవీలు జరిగాయి.

ఈ మేరకు శనివరం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. గతేడాది ఇదే నెలతో పోల్చితే 22శాతం అదనంగా లావాదేవీలు జరిగినట్లు ఎన్‌పిసిఐ వెల్లడించింది. అయితే విలువ పరంగా అది 19శాతంగా తెలిపింది

జులైలో రోజుకు సగటుగా 96వేల కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలిపింది. దేశంలో పట్టణాలు, నగరాల్లోనే కాకుండా గ్రామీణ స్థాయిలోకి సైతం యుపిఐ లావాదేవీలు చొచ్చుకు పోవడం వల్లే ఇది సాధ్యమైందని పేమెంట్స్ కార్పొరేషన్ ప్రకటనలో పేర్కొంది. రీఛార్జ్‌ల కోసం కూడా ప్రజలు డిజిటల్ లావాదేవీలనే ఉపయోగిస్తున్నారని వివరించింది.

# తగ్గిన నిరుద్యోగ రేటు



దేశీయ జాబ్ మార్కెట్ నుండి సానుకూల సంకేతాలు వెలువడుతున్నాయి, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పుంజుకోవడంతో జాతీయ నిరుద్యోగ రేటు గణనీయంగా తగ్గింది. నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) విడుదల చేసిన నివేదిక ప్రకారం, 15 ఏళ్లు పైబడిన వారిలో మొత్తం నిరుద్యోగిత రేటు జూన్‌లోని 5.5 శాతం నుండి గత నెలలో 5.1 శాతానికి తగ్గింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ రేటు 5 శాతం నుండి 4.5 శాతానికి పడిపోవడం విశేషం. అయితే పట్టణ ప్రాంతాల్లో నిరుద్యోగ రేటు 6.7 శాతంతో దాదాపు స్థిరంగా కొనసాగింది. పురుషుల్లో నిరుద్యోగం 5 శాతానికి తగ్గగా, మహిళల్లో కూడా నిరుద్యోగం తగ్గుముఖం పట్టింది. మార్కెట్లో పని చేసేందుకు ముందుకు వచ్చే వారి సంఖ్యను తెలిపే 'శ్రామిక శక్తి భాగస్వామ్య రేటు' (ఎల్ఎఫ్‌పీఆర్) జూన్‌లో ఉన్న 54.4 శాతం నుండి జూలై నాటికి 55.4 శాతానికి పెరిగింది. ఈ పెరుగుదలలో గ్రామీణ మహిళలు కీలక పాత్ర పోషించారు. గ్రామీణ మహిళల ఎల్ఎఫ్‌పీఆర్ ఏకంగా 36.6 శాతం నుండి 38.8 శాతానికి దూసుకెళ్లింది. దీనికి అనుగుణంగానే, ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్న వారి నిష్పత్తిని తెలిపే 'వర్కర్ పాపులేషన్ రేషియో' (డబ్ల్యూపీఆర్) కూడా 51.4 శాతం నుండి 52.5 శాతానికి మెరుగుపడింది. పట్టణ ప్రాంతాల కంటే పల్లెల్లోనే ఉపాధి నమోదు, ఆర్థిక కార్యకలాపాలు వేగంగా పుంజుకుంటున్నాయని గణాంకాలు వెల్లడించాయి.

# బ్రిక్స్ సదస్సుకు చైనా అధ్యక్షుడు



హైదరాబాద్, : ఏడేళ్ల విరామం అనేది చిన్న విషయం కాదు, ముఖ్యంగా విస్తృతంగా వాణిజ్యం చేసుకుంటూ, సరిహద్దు ఉద్రిక్తతల కారణంగా తరచుగా విభేదించే రెండు పొరుగు దేశాలైన భారత్, చైనాల విషయంలో ఇది మరింత ముఖ్యమైనది. ఇప్పుడు, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భారత పర్యటనపై వార్తలు వస్తున్నాయి. ఆయన సెప్టెంబర్ 12, 13 తేదీలలో న్యూఢిల్లీలో జరిగే బ్రిక్స్ సదస్సుకు హాజరు కానున్నారు. ఆయనతో పాటు సుమారు 400 మంది అధికారులతో కూడిన ఒక పెద్ద ప్రతినిధి బృందం రావచ్చని సమాచారం. హోటళ్లను సమీక్షిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లు జరుగుతున్నాయి. పర్యటన ప్రణాళికలను రూపొందిస్తున్నారు. అయినప్పటికీ, షీ భారతదేశానికి వస్తున్నారని బీజింగ్ ఇంకా ప్రకటించలేదు. సన్నాహాలు ఇంత విస్తృతంగా ఉంటే, ప్రకటనలో ఎందుకీ ఆలస్యం? చివరి నిమిషం వరకు చైనా తన వ్యూహాలను గోప్యంగా ఉంచడానికి ప్రయత్నిస్తోందా? లేక మోదీ, షీల మధ్య ప్రత్యేక సమావేశానికి సంబంధించిన అజెండా ఇంకా ఖరారు కాలేదా? మీడియా నివేదికల నుంచి వస్తున్న కొన్ని వార్తల తర్వాత ఈ ప్రశ్నలు మరింత పెద్దవిగా మారాయి. జిన్‌పింగ్ చివరిసారిగా 2019 అక్టోబర్‌లో భారతదేశాన్ని సందర్శించారు. ఆయన మహాబలిపురంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిశారు . సముద్ర తీరంలో ఇద్దరు నాయకులు ఉన్న ఫోటోలు వార్తల్లో ప్రముఖంగా నిలిచాయి. అప్పటి వాతావరణం భిన్నంగా ఉండేది. కొన్ని నెలల తర్వాత, గాల్వాన్ లోయలో జరిగిన హింసాత్మక ఘర్షణలో భారత, చైనా సైనికులు మరణించారు. సరిహద్దు వెంబడి ఉద్రిక్తతలు పెరిగాయి. ఇరు దేశాలు భారీ సంఖ్యలో సైనిక బలగాలను మోహరించాయి. చైనా యాప్‌లపై భారత్ కఠిన చర్యలు చేపట్టింది. పెట్టుబడులు, వాణిజ్యం కూడా కష్టంగా మారాయి. అక్టోబర్ 2024లో గస్తీలు , దళాల ఉపసంహరణపై కొంత ఒప్పందం కుదిరింది. చర్చలు పునఃప్రారంభమయ్యాయి, కానీ సంబంధాలలో ఏర్పడిన చీలిక మాత్రం నయం కాలేదు. ఇప్పుడు, ఒకవేళ షీ భారతదేశానికి వస్తే, ఆయన విమానం కేవలం ఒక విదేశీ అతిథిని మాత్రమే తీసుకురాదు. అది తనతో పాటు ఏడేళ్ల ఉద్రిక్తతను, గాల్వాన్ లోయ జ్ఞాపకాలను, భవిష్యత్తుపై ఎన్నో ఆశలను కూడా తీసుకువస్తుంది.ప్రపంచ వాణిజ్యం చుట్టూ ఒక కొత్త ఘర్షణ మొదలవుతోంది. అమెరికా ఒత్తిడి పెరిగింది. చైనా కొత్త మార్కెట్లను, బలమైన భాగస్వాములను కోరుకుంటోంది. భారతదేశం ఒక ప్రధాన ప్రపంచ మార్కెట్ , గ్లోబల్ సౌత్‌కు బలమైన గొంతుకగా కూడా మారింది. భారతదేశంతో ఘర్షణలు కొనసాగించడం చైనాకు కూడా ప్రయోజనకరం కాదు, ముఖ్యంగా అది బహుముఖంగా ఆర్థిక, వ్యూహాత్మక సవాళ్లను ఎదుర్కొంటున్న తరుణంలో. అందుకే షీ సంభావ్య పర్యటన ఆకస్మిక స్నేహ సంకేతం కాదు. అది చైనాకు ఒక అవసరం కావచ్చు. అయితే, తన సంబంధాలను చక్కదిద్దుకోవాల్సిన అవసరం ఉన్న ఏకైక దేశం చైనా మాత్రమే కాదు. సరిహద్దులో నిరంతర ఉద్రిక్తతను భారత్ కూడా కోరుకోవడం లేదు. దీర్ఘకాలిక సైనిక మోహరింపులు ఖర్చుతో కూడుకున్నవి. వాణిజ్య అనిశ్చితి భారతీయ కంపెనీలపై కూడా ప్రభావం చూపుతుంది ఇద్దరూ సంభాషణ కోరుకుంటున్నారు. తేడా ఒక్కటే, ఇద్దరూ తమ తమ పద్ధతుల్లో మాట్లాడాలని కోరుకుంటున్నారు.చైనా జాతీయ జాతకం అక్టోబర్ 1, 1949 నాటిది. దాని లగ్నం మకర రాశి. సెప్టెంబర్ 2026లో, గురు గ్రహం దాని జాతకంలో ఏడవ ఇంట్లో ఉంటుంది.దేశ జాతకంలో ఏడవ ఇల్లు ఇతర దేశాలతో సంబంధాలను మరియు ముఖాముఖి సంభాషణలను సూచిస్తుంది. ఇక్కడ గురు గ్రహం బలమైన స్థానం, ప్రధాన అంతర్జాతీయ వేదికలపై చైనా భాగస్వామ్యాన్ని పెంచగలదు. మరో ముఖ్యమైన సూచన ఏంటంటే, చైనా జాతకంలో ఆగస్టు 25 నుంచి అక్టోబర్ 2 వరకు గురు ముద్రా దశ అమలులో ఉంటుంది. ఈ కాలం విదేశీ సంబంధాలు, పెద్ద సమూహాలు , దౌత్యపరమైన విజయాలతో ముడిపడి ఉంటుంది. ఇదే కాలంలో బ్రిక్స్ సదస్సు జరుగుతోంది. ఈ యాదృచ్ఛికతను విస్మరించలేము.సెప్టెంబర్‌లో చైనా రాశిఫలాలు ప్రధాన విదేశీ పర్యటనలు, ఉన్నత స్థాయి చర్చలకు అవకాశం ఉందని సూచిస్తున్నాయి. ఇది షీ భారతదేశ పర్యటనకు ఉన్న అవకాశాలను బలపరుస్తుంది. అయితే, ఇక్కడ చేసిన విశ్లేషణ చైనా జాతీయ రాశిఫలాలను ప్రతిబింబిస్తుంది కానీ షీ వ్యక్తిగత రాశిఫలాలను కాదు కాబట్టి, దీనిపై ఒక నిశ్చయాత్మక నిర్ధారణకు రాలేము.భారతదేశ జాతకం వృషభ లగ్నం. సెప్టెంబరులో, గురు గ్రహం పొరుగువారు, సమాచార మార్పిడి చర్చలకు సంబంధించిన తృతీయ భావంలో ఉంటుంది.

# కౌశిక్ రెడ్డిపై వేటు తప్పదా?



హైదరాబాద్, : ఈ ఏడాది మార్చిలో అసెంబ్లీలో జరిగిన గొడవ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి సీటుపై చర్చకు దారితీస్తోంది. కడియం శ్రీహరితో వాగ్వాదం, అనుచిత సైగలు చేశారన్న ఆరోపణలతో స్పీకర్ ఈ అంశాన్ని ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేశారు. ఎథిక్స్ కమిటీ లేకుండానే..కౌశిక్‌రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీకి ఫార్వర్డ్ చేయడమేంటంటూ బీఆర్ఎస్ క్వశ్చన్ చేస్తూ వచ్చింది. ఎథిక్స్ కమిటీ కౌశిక్‌రెడ్డి నుంచి వివరణ తీసుకుంటుందా.? మందలింపుతో సరిపెడుతుందా? లేక కఠిన చర్యలకు సిఫారసు చేస్తుందా.? అన్నది ఉత్కంఠగా మారింది. అయితే ఎథిక్స్ కమిటీ విచారణ జరిపి సిఫారసు చేయడం ఒక దశ. దానిపై స్పీకర్, సభ నిర్ణయం తీసుకోవడమనేది సెకండ్ ఎపిసోడ్. కాబట్టి ఇప్పుడే కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే పదవి ఉంటుందో.? ఊడుతుందో.? చెప్పలేం. కానీ.. వేటు పడితే ఏంటన్న చర్చ మాత్రం రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది.ఒకవేళ వేటు వేసే సిచ్యువేషన్ ఉంటే..కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చినా..లేదా ఏదైనా చట్టపరమైన ప్రక్రియ ద్వారా హుజూరాబాద్ స్థానం ఖాళీ అయినా..అక్కడ మరోసారి ఉప ఎన్నిక తప్పదన్నదే ఇప్పుడు ఇంట్రస్టింగ్ పాయింట్. బీఆర్ఎస్ హయాంలో అక్కడ ఉప ఎన్నిక జరిగింది. ఇప్పుడు మరోసారి బైపోల్ వస్తే మాత్రం.. బీఆర్ఎస్, కాంగ్రెస్ బలాబలాల పరీక్షగా మారే అవకాశం ఉంది. అయితే కాంగ్రెస్ ఎథిక్స్ అస్త్రంపై బీఆర్ఎస్ ఎదురుదాడి మొదలుపెట్టింది.కాంగ్రెస్ అంతర్గత పోరు నుంచి జనం దృష్టిని మరల్చేందుకే కౌశిక్‌రెడ్డి ఇష్యూను మరోసారి తెరపైకి తెచ్చారంటున్నారు బీఆర్ఎస్. రాష్ట్రంలో ఇన్ని సమస్యలు ఉండగా..ఓ వైపు అధికార పార్టీ మంత్రి కొండా సురేఖ ఎపిసోడ్..ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి వ్యాఖ్యల దుమారం నడుస్తుంటే..కౌశిక్‌రెడ్డి అంశంపై ఎథిక్స్ కమిటీ భేటీ కావడం పక్కా అటెన్షన్ డైవర్షన్ గేమే అంటోంది కారు పార్టీ. అంతేకాదు సీఎం సహా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు చేసిన వ్యాఖ్యలు, ప్రవర్తనను కూడా కమిటీ ముందు ప్రస్తావిస్తామంటోంది బీఆర్ఎస్. కౌశిక్‌రెడ్డి వ్యవహారాన్ని బీఆర్ఎస్ కేవలం ఒక ఎమ్మెల్యే కేసుగా కాకుండా..రాజకీయ అంశంగా మార్చే ప్రయత్నం చేస్తోందన్న చర్చ సాగుతోంది.ఒకవేళ కౌశిక్‌రెడ్డిపై వేటు పడి..హుజూరాబాద్ ఉపఎన్నిక వస్తే..కాంగ్రెస్‌కు అగ్నిపరీక్షగా మారనుంది. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై ప్రజల తీర్పుగా బీఆర్ఎస్ ప్రచారం చేసే అవకాశం ఉంటుంది. మరోవైపు బీఆర్ఎస్‌కు కూడా తమ రాజకీయ బలం ఎంతో చూపించుకునే వేదికగా మారొచ్చు. ఎథిక్స్ కమిటీ దగ్గర మొదలైన వ్యవహారం..చివరికి హుజూరాబాద్ ఎన్నికల బరిలోకి వెళ్తుందా.? లేక అసెంబ్లీ హాల్ లోపలే సమసిపోతుందా అనేది సస్పెన్స్‌గా మారింది.అసెంబ్లీలో కౌశిక్‌రెడ్డి దూకుడు. ప్రభుత్వంపై వరుస విమర్శలు..వివాదాస్పద వ్యాఖ్యలు..సస్పెన్షన్లతో ఆయన ఇప్పటికే పేరు పలుసార్లు వార్తల్లోకి నిలిచారు. చర్యలు లేకపోతే..ఈ ఎపిసోడ్ అక్కడితో ముగిసినట్టే.స్ట్రిక్ట్ యాక్షన్‌కు ఎథిక్స్ కమిటీ సిఫారసు చేస్తే మాత్రం..కొత్త పొలిటికల్ ఫైట్ మొదలయ్యే ఛాన్స్ ఉంది. వేటు వేస్తే ఎమ్మెల్యే పదవిపై ప్రభావం చూపే పరిస్థితి వస్తే..హుజూరాబాద్‌లో ఉపఎన్నిక రావొచ్చు. అప్పుడు హుజురాబాద్ మళ్లీ తెలంగాణ రాజకీయాల హాట్ టాపిక్‌గా మారుతుందా.? బీఆర్ఎస్ మళ్లీ ఆ సీటును నిలబెట్టుకుంటుందా.? కాంగ్రెస్ గులాబీ కోటలో పాగా వేస్తోందా.? ఎథిక్స్ కమిటీ విచారణతో కౌశిక్‌రెడ్డి ఎపిసోడ్ ఏ మలుపు తిరుగుతుందోనన్నది సస్పెన్స్‌గా మారింది

# ఇండియా, చైనా రష్యా...!

ముంబై, : ఇండియా అంటే చాలు చైనా తన కళ్లల్లో నిప్పులు పోసుకుంటుంది. మన సరిహద్దులను ఆక్రమిస్తూ ఉంటుంది. మన దేశ సైనికుల మీద నిబంధనలు అతిక్రమించి దాడులకు ఉసిగొలుపుతూ ఉంటుంది.. అటువంటి చైనా ఒక్కసారిగా మన మాట విని తన ఆర్మీని వెనక్కి తీసుకుందిచైనా దేశంలో ఇద్దరు ఉన్నత స్థాయి అధికారులను అక్కడి ప్రభుత్వం తొలగించింది. దీని వెనక భౌగోళికమైన రాజకీయ కారణాలు ఉన్నాయి. చైనా దేశంలో అత్యున్నత సైనిక కమాండ్ బాడీ అయిన సెంట్రల్ మిలిటరీ కమిషన్ నుంచి గ్యాంగ్ యుగాజియా.. లియో జనీల్ అనే ఇద్దరు సీనియర్ జనరల్స్ ను తొలగించింది. చైనాలో కొంతమంది అవినీతిపరులైన అధికారులు అమెరికా ప్రేరేపిత కుట్రలో భాగంగా భారత్, చైనా, భారత్ పాకిస్తాన్ మధ్య విభేదాలను సృష్టించాలని ప్రయత్నించారు. రష్యా, ఉక్రెయిన్, ఇరాన్ వంటి అంతర్జాతీయ సంక్షోభాల నుంచి ప్రపంచదృష్టిని మళ్లించడానికి ఈ ప్రయత్నం జరిగింది.. ఈ పరిణామాలను జాగ్రత్తగా పరిశీలించిన భారత్ వెంటనే అప్రమత్తమైంది.. భారత జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్ చైనాలో.. భారత విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ రష్యాలో పర్యటించారు. మన దేశానికి వ్యతిరేకంగా జరుగుతున్న కుట్రలను పకడ్బందీ ఆధారాలతో ఆయా దేశాల నాయకత్వాలకు వివరించారు. దీనివల్ల చైనా వాస్తవ పరిస్థితి తెలుసుకుని.. సైనిక అధికారులను విధుల నుంచి తొలగించింది. చైనా అధ్యక్షుడు తన సొంత మార్గాల ద్వారా ఈ విషయాలను ధృవీకరించుకున్నారు. ఆ తర్వాత ఆ అధికారులను తొలగించారు.. అంతేకాదు భారత సరిహద్దుల్లో మోహరించిన చైనా ఆర్మీని వెనక్కి పంపించారు.కొద్దిరోజులుగా భారత సరిహద్దులో చైనా తన ఆర్మీని మోహరించింది. వారి కదలికలను పెంచింది. ఇది మన దేశ ప్రభుత్వానికి ఇంటలిజెన్స్ వర్గాల ద్వారా తెలిసింది. వాస్తవానికి గాల్వన్ లోయలో జరిగిన ఘటన తర్వాత భారత సైన్యం ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటున్నది. అలాగని చైనాతో గిల్లి కజ్జాలు పెట్టుకోవడం లేదు. అయితే చైనా గెలికి వాసన చూసే రకం. పైగా కొంతమంది అవినీతిపరులైన అధికారులు ఆ దేశ ఆర్మీలో ఉండడంతో.. భారతదేశాన్ని కవ్వించే విధంగా చేస్తున్నారు. ఇది మన దేశ ఇంటెలిజెన్స్ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. దీని వెనుక ఏదో కుట్ర దాగి ఉందని గుర్తించి లోతుగా తవ్వడం మొదలుపెట్టింది. దీని వెనక అమెరికా అమెరికా ఉన్నట్టు గుర్తించి.. ఈ విషయాలను చైనా.. ఇతర దేశాల దృష్టికి తీసుకెళ్ళింది. దీంతో అమెరికా అసలు రంగు బయటపడింది. మరి దీనిపై అమెరికా ఏవిధంగా చర్యలు తీసుకుంటుంది.. అమెరికా ప్రభుత్వ పెద్దల ఆదేశాలతోనే జరిగిందా.. లేకుంటే ఎవరైనా అధికారుల అత్యుత్సాహం వల్ల జరిగిందా అనేది విచారణలో తేలుతుందని తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ చైనాతో జరగబోయే ముప్పును ముందుగానే ఊహించిన భారత్.. దానికి పరిష్కార మార్గాన్ని అన్వేషించింది. చివరికి అమెరికా కంటిని అమెరికా చేతితోనే పొడి పించింది. అంతేకాదు సరిహద్దుల్లో భారీగా మోహరించిన చైనా సైనికులను చైనా ప్రభుత్వమే వెనక్కి పంపించే విధంగా చేసింది. మొత్తానికి భారత్ తనకు ఎదురు కాబోతున్న ముప్పును అత్యంత చాకచక్యంగా పరిష్కరించుకుంది.


# కొండా, కోమటిరెడ్డికి గులాబీ భరోసా





హైదరాబాద్ : రేవంత్ రెడ్డి వచ్చేదాకా కాంగ్రెస్ పార్టీ సరైన సవాల్ కెసిఆర్ కు విసర లేకపోయింది. కెసిఆర్ కొడుతుంటే పడింది. కెసిఆర్ తిడుతుంటే పడింది. కెసిఆర్ తొక్కుతుంటే పాతాళం దాకా వెళ్ళిపోయింది. అంతేతప్ప కేసీఆర్ కు కౌంటర్ ఇచ్చే సాహసం కాంగ్రెస్ పార్టీ చేయలేకపోయింది.తెలంగాణ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో రెండు పర్యాయాలు అధికారంలోకి రాలేకపోయింది అంటే ఆ పార్టీలో నాయకత్వ లోపం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. చివరికి రేవంత్ రెడ్డి వచ్చేదాకా కాంగ్రెస్ పార్టీలో నిస్తేజం అలానే ఉందంటే.. ఆ పార్టీలో నాయకత్వం ఎంత దారుణంగా ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. రేవంత్ రెడ్డి పిసిసి అధ్యక్షుడిగా వచ్చిన తర్వాత ఒకసారిగా పార్టీ పరిస్థితి మారిపోయింది. కెసిఆర్ కు సవాల్ కాదు.. కెసిఆర్ పీఠాన్ని పక్కకు జరిపి చూపించాడు రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డికి బయట పల్లకి మోత ఉన్నప్పటికీ.. ఇంట్లో మాత్రం ఈగల మోత ఉంది. అదే అతడికి ఇప్పుడు ఇబ్బందికరంగా మారింది.మునుగోడు ఉప ఎన్నికల్లో బిజెపి తరఫున కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పోటీ చేసినప్పుడు ఆయనకు వ్యతిరేకంగా గులాబీ మీడియా బీభత్సంగా కథనాలు ప్రసారం చేసింది. కేవలం బొగ్గు కాంట్రాక్టు కోసమే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి బిజెపిలో చేరారని ఆరోపణలు చేసింది. ఆ విషయాన్ని ఎన్నికలకు ముందు విపరీతంగా ప్రచారం చేసింది. తద్వారా మునుగోడు ఉప ఎన్నికల్లో గులాబీ పార్టీ కమ్యూనిస్టుల సహాయంతో విజయం సాధించింది.నాడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి వ్యతిరేకంగా రాసిన నమస్తే తెలంగాణ.. వ్యతిరేకంగా వార్తలు ప్రసారం చేసిన టీ న్యూస్ కు ఇప్పుడు హఠాత్తుగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గొప్పవాడిగా మారిపోయాడు. ఆ పత్రికలో.. ఆ చానల్లో రాజగోపాల్ రెడ్డికి విపరీతమైన ప్రయారిటీ లభిస్తుంది. దీనికి ప్రధాన కారణం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని అతడు పరోక్షంగా విమర్శిస్తూ ఉండడమే.. అందువల్లే ఆ పత్రికకు రాజగోపాల్ రెడ్డి ఇప్పుడు అత్యంత ఆప్తుడిగా మారిపోయాడు. నమస్తే తెలంగాణ అంటే.. టీ న్యూస్ అంటే మరి ఏదో కాదు.. అవి పరోక్షంగా కేసీఆర్ మానస పుత్రికలు. కెసిఆర్ మానస పుత్రికల లాంటి మీడియాలో వార్తలు వచ్చాయంటే.. కచ్చితంగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కేసిఆర్ కు ఇప్పుడు అత్యంత ఆప్తుడు.ఆమధ్య సినీ నటుడు నాగార్జున పెద్ద కుమారుడు నాగచైతన్య విడాకుల విషయంలో కొండా సురేఖ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఆ వ్యాఖ్యలకు గులాబీ మీడియా విపరీతమైన ప్రయారిటీ ఇచ్చింది. సురేఖ పై తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకుంటూ కథనాలను పబ్లిష్ చేసింది. చివరికి కేటీఆర్ కూడా సురేఖ తీరును తీవ్రంగా తప్పుపట్టారు. సురేఖ కుమార్తె ఇటీవల ముఖ్యమంత్రి మీద విమర్శలు చేయడంతో హఠాత్తుగా గులాబీ మీడియాకు కొండా సురేఖ బీసీ నాయకురాలుగా కనిపిస్తోంది. బీసీ నాయకురాలి మీద కుట్ర అంటూ వార్తలను పబ్లిష్ చేస్తోంది. ద్వంద్వ ప్రమాణాల గులాబీ పాత్రికేయాన్ని బయటపడుతోంది. ఇంత జరుగుతున్నప్పటికీ గులాబీ పార్టీ మీడియా సెల్ఫ్ కుక్ డ్ వార్తల మీద కాంగ్రెస్ శ్రేణులు కౌంటర్ ఇవ్వకపోవడం నిజంగా ఆ పార్టీ భావ దారిద్ర్యం..

# నిమ్మ ధరలు... పైపైకి...



హైదరాబాద్, : పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు నిత్యావసర వస్తువుల ధరల భారం క్రమంగా పెరుగుతోంది. ఇప్పటికే వంట నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులు ధరలు భారీగా పెరగ్గా.. చక్కెర, ఉల్లిపాయల ధరలు కూడా పెరిగాయి.. తాజాగా.. ఈ బాటలో నిమ్మకాయ కూడా చేరింది. నిమ్మ ధరలుసైతం ఒక్కసారిగా పెరిగాయి.తెలుగు రాష్ట్రాల్లో రిటైల్ మార్కెట్లో ఉల్లి, పంచదార ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో రోజువారీ కిరాణాల ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. గతంలో కిలో రూ.25 నుంచి రూ.35 మధ్య లభించిన ఉల్లిపాయలు.. ప్రస్తుతం.. కిలో రూ.55 నుంచి రూ.70 వరకు చేరింది. అలాగే చెక్కర ధర కూడా పెరిగింది. గతంలో కిలో చెక్కర రూ.45 నుంచి రూ.48 వరకు ఉండగా.. ప్రస్తుతం కిలో చెక్కర రూ. 65 నుంచి రూ. 70కి పెరిగింది. ఇదేబాటలో నిమ్మకాయ కూడా చేరింది.

నిమ్మకాయ ధరలు రికార్డు స్థాయిలో పెరిగాయి.ఎకనామిక్స్ ఆన్‌లైన్ కోర్సులు ఎంచుకోవడంనిమ్మకాయల ధరలకు రెక్కలొచ్చాయి. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంట దిగుబడులు తగ్గడం, మార్కెట్లో డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో ధరలు

పెరిగాయి. ఏప్రిల్, మే నెలల్లో డజను ధర రూ. 100 పలికింది. జూన్, జులై నెలల్లో రూ.30 నుంచి రూ. 40వరకు చేరింది. అయితే, నాలుగైదు రోజుల నుంచి నిమ్మ ధర రికార్డు స్థాయిలో పెరగడమే కాకుండా ఏకంగా డజను రూ. 120కు చేరడంతో వినియోగదారులు బెంబెలెత్తుతున్నారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరగడంతో అల్లాడుతున్న వినియోగదారునికి ఆకాశాన్నంటుతున్న నిమ్మ ధరలు శరాఘాతంగా మారాయి.

# మీడియా మొఘల్ కి కష్టాలు...

ముంబై, : జీ, ఎస్సెల్ గ్రూప్ సంస్థల ఫౌండర్ సుభాష్ చంద్ర దివాలా తీశారు. తన వద్ద రూపాయి కూడా లేదని అంటున్నారు. ఆయన సాధారణ బిజినెస్ మెన్ కాదు. మరి ఎలా దివాలా తీశారు..? భారతీయ బిజినెస్ ప్రపంచంలో సుభాష్ చంద్ర ప్రయాణం ఒక అద్భుతమైన రోలర్‌కోస్టర్ రైడ్ లాంటిది. 1969లో 17 ఏళ్ల వయసులో కుటుంబం ఎదుర్కొన్న రూ. 3.5 లక్షల అప్పుల భారంతో చదువు ఆపేసిన ఆయన, శూన్యం నుంచి వేల కోట్ల సామ్రాజ్యాన్ని నిర్మించారు. 1992లో దూరదర్శన్ మాత్రమే ఉన్న కాలంలో, భారతదేశంలోనే మొట్టమొదటి ప్రైవేట్ శాటిలైట్ ఛానెల్ జీ టీవీ ను ప్రారంభించి భారత మీడియా మొఘల్ గా అవతరించారు. ఎస్సెల్ ప్యాకేజింగ్, ఎస్సెల్ వరల్డ్ అమ్యూజ్‌మెంట్ పార్క్, జీ మీడియా ద్వారా ఆయన బహుముఖ వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించారు.అయితే, ఆయన సాధించిన అపారమైన విజయం వెనుక అపరిమితమైన అప్పులు అనే బిజినెస్ ప్రమాదం పొంచి ఉండిపోయింది. మీడియా రంగంలో విజయం సాధించిన తర్వాత, సుభాష్ చంద్ర తన వ్యాపారాన్ని మౌలిక సదుపాయాల , ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు, సోలార్ పవర్, రోడ్లు, డిష్ టీవీ విస్తరణ , డిజిటల్ నెట్‌వర్క్‌ల వైపు విస్తరించారు. ఎస్సెల్ గ్రూప్ ద్వారా భారీస్థాయి ప్రాజెక్టుల కోసం బ్యాంకుల నుంచి, మ్యూచువల్ ఫండ్స్ నుంచి వేల కోట్ల రూపాయల రుణాలు తీసుకున్నారు.ఈ అప్పులే ఆయన సామ్రాజ్యానికి మొదటి గొడ్డలిపెట్టుగా మారాయి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ , సోలార్ ప్రాజెక్టులలో అనుకున్నంత ఆదాయం రాకపోవడం, ఊహించని రీతిలో ప్రాజెక్టులు ఆలస్యం కావడం వల్ల గ్రూప్ తీవ్ర నగదు కొరత లో కూరుకుపోయింది. ప్రాజెక్టుల నుంచి వచ్చే రాబడితో అప్పుల వడ్డీలు కూడా కట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీనికి తోడు, తాను తీసుకున్న రుణాలకు సుభాష్ చంద్ర తన సొంత జీ ఎంటర్‌టైన్‌మెంట్ షేర్లను ఈక్విటీగా తాకట్టు పెట్టడం అతిపెద్ద వ్యూహాత్మక పొరపాటైందిఅప్పులు తీర్చలేకపోవడంతో 2019 నుంచి రుణదాతలు తాకట్టులో ఉన్న జీ టీవీ షేర్లను విక్రయించడం ప్రారంభించారు. దీంతో ఎస్సెల్ గ్రూప్ తన ప్రధాన వ్యాపారమైన జీ టీవీలో మెజారిటీ వాటాను కోల్పోవలసి వచ్చింది. వందల కోట్ల అప్పులు తీర్చేందుకు ఆయన డిష్ టీవీ, పవర్ ప్లాంట్లు, మీడియా వాటాలను విక్రయించాల్సి వచ్చింది. అయినప్పటికీ, దాదాపు రూ. 22,000 కోట్లకు పైగా రుణాలకు సంబంధించి వ్యక్తిగత పూచీకత్తులు ఇవ్వడంతో నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ లో ఆయనపై వ్యక్తిగత దివాలా ప్రక్రియలు ప్రారంభమయ్యాయి. సొంత వ్యాపారాలు మినహా ఇతర ప్రమాదకర రంగాల్లోకి అప్పులతో అడుగుపెట్టడం, వ్యక్తిగత పూచీకత్తులతో షేర్లను తాకట్టు పెట్టడం ఏ స్థాయిలో ఉన్న వ్యాపారవేత్తనైనా ఎలా కోలుకోలేని దెబ్బతీస్తుందనే దానికి సుభాష్ చంద్ర ప్రయాణం ఒక నిదర్శనం.

# 40 కోట్ల టెండర్ కు రెండున్నర కోట్ల అమ్యామ్యాలు...

హైదరాబాద్, : వడ్డించేవాడు మనవాడు అయితే బంతిలో ఎక్కడ కూర్చున్న పర్వాలేదు. ఈ సామెతను గడిచిన కొన్ని సంవత్సరాలుగా మహిళ ఐఏఎస్ అధికారి నిజం చేసి చూపిస్తున్నారు. చూపించడమే కాదు దర్జాగా కోట్లను తన ఖాతాలో వేసుకుంటున్నారు. ఇదంతా కూడా వాట్సప్ కాల్ ద్వారా ఆమె చేసి చూపిస్తున్నారు.గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ శాఖలో ఆ మహిళా అధికారి కీలకంగా ఉండేవారు. గతంలో ఆమె తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా పేరుపొందిన జిల్లాకు కలెక్టర్ గా వ్యవహరించారు. ఆ తర్వాత ఆమె ఒక శాఖలో కీలక అధికారిగా పనిచేస్తున్నారు. ఈ శాఖలో రకరకాల అభివృద్ధి పనులు జరుగుతూ ఉంటాయి. గతంలో గులాబీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఒక సంస్థకు ఆమె కాంట్రాక్టు కట్టబెట్టారు. ఏకంగా 40 కోట్ల టెండర్ ఆ సంస్థకు అందే విధంగా చూశారు. అప్పటినుంచి ఆ సంస్థ అధిపతులకు.. ఆ మహిళ ఐఏఎస్ అధికారికి ఫెవికాల్ సంబంధం ఏర్పడింది. ఆ అధికారికి.. కంపెనీకి మధ్య వ్యవహారాలు చక్కబెట్టడానికి ఒక ఏడి స్థాయి అధికారి పనిచేసేవారు. గులాబి పార్టీ.. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ.. అధికారంలో ఎవరు ఉన్నా సరే ఆ శాఖకు సంబంధించిన కాంట్రాక్ట్ మొత్తం ఆ కంపెనీకి దక్కుతుంది. పైగా ఎటువంటి నిబంధనలు పాటించే అవకాశం లేకుండానే ఆ మహిళా అధికారి ఆ సంస్థకు టెండర్ దక్కే విధంగా చూస్తుంటారు.ప్రభుత్వ మారినప్పటికీ.. అధికారులు మారినప్పటికీ ఆ మహిళ ఐఏఎస్ అధికారి మాత్రం ఆ శాఖలోనే ఉంటారు. పైగా ఆ కంపెనీకి మాత్రమే కాంట్రాక్ట్ దక్కే విధంగా చూస్తుంటారు. ఇలా కాంట్రాక్ట్ దక్కేలా చూసినందుకు ఆ కంపెనీ ఆ మహిళా అధికారికి ఏకంగా 2.5 కోట్లు చెల్లించినట్టు తెలుస్తోంది. రెండు విడతలుగా అది కూడా నగదు రూపంలో ఆ మహిళ అధికారికి ఆ కంపెనీ నిర్వాహకులు ఇచ్చినట్టు సమాచారం.

# టీడీపీ గూటికి మేకపాటి ఫ్యామిలీ

**నెల్లూరు,** :తెలుగుదేశం పార్టీలో మళ్లీ చేరికలు మొదలయ్యే అవకాశం కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా చాలామంది నేతలు టిడిపి తో పాటు కూటమి పార్టీల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే సరైన సమయం కోసం వేచి చూస్తూ వస్తోంది టీడీపీ. అవసరం అనుకున్న క్రమంలో ఒక్కో నేత చేరిక ఉండాలని భావించింది. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక బలమైన కుటుంబాన్ని టిడిపిలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు పూర్తయినట్లు సమాచారం. త్వరలో ఆ బలమైన ఫ్యామిలీ టిడిపిలోకి రావడం ఖాయం అని తేలిపోయింది. దానిపైనే పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది.గత కొన్ని రోజులుగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో అంటి ముట్టనట్టుగా ఉంది మేకపాటి ఫ్యామిలీ. రాజకీయాలపై కాకుండా వ్యాపారాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టింది. రాజకీయంగా మనసు మారింది అని ఆ ఫ్యామిలీ పై ఒక ప్రచారం ఉంది. అందుకు తగ్గట్టుగానే పరిస్థితులు ఉన్నాయి.

కూటమి వచ్చిన తర్వాత ఆ ఫ్యామిలీ పై ఎటువంటి వివాదాలు కానీ కేసులు కానీ లేవు. వారి పని వారు చేసుకుంటున్నారు. కానీ వైసీపీలో జరుగుతున్న పరిణామాలపై తీవ్ర ఆవేదనతో ఉన్నారు మేకపాటి రాజమోహన్ రెడ్డి. ఈ క్రమంలోనే

జగన్ చుట్టూ ఉన్న కోటరీ మారాలని.. జగన్ వైఖరిలో మార్పు రావాలని కామెంట్స్ చేశారు మేకపాటి.

# ఈ సంకేతాలను నిర్లక్ష్యం చేయకండి....!




రక్తపోటు అకస్మాత్తుగా 200 దాటితే అది ప్రాణాంతకమైన 'హైపర్‌టెన్సివ్ క్రైసిస్' కావచ్చు. ఈ స్థితిలో గుండె, మెదడు, మూత్రపిండాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. సాధారణంగా రక్తపోటు 120/80 ఎఎఊఊణ ఉంటే దానిని ఆరోగ్యకరమైన స్థాయిగా పరిగణిస్తారు. కానీ ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి, ఒత్తిడి కారణంగా చాలా మందిలో బీపీ స్థాయిలు అదుపు తప్పుతున్నాయి. ఒకవేళ మీ రక్తపోటు అకస్మాత్తుగా 200 దాటితే, వైద్య పరిభాషలో దీనిని 'హైపర్‌టెన్సివ్ క్రైసిస్' అని పిలుస్తారు.

ఇది అత్యంత ప్రమాదకరమైన స్థితి. ఈ సమయంలో శరీరంలోని కీలక అవయవాలైన గుండె, మెదడు, మూత్రపిండాలకు తక్షణమే నష్టం జరిగే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మెదడు గుండెపై తీవ్ర ప్రభావం అధిక రక్తపోటు నేరుగా మెదడులోని రక్తనాళాలపై ఒత్తిడిని పెంచుతుంది. బీపీ 200 దాటినప్పుడు మెదడులోని సున్నితమైన రక్తనాళాలు చిట్లిపోయే ప్రమాదం ఉంది, ఇది తక్షణమే పక్షవాతానికి దారితీస్తుంది. బాధితులు ఈ సమయంలో తీవ్రమైన తలనొప్పి, కళ్ళు తిరగడం, దృష్టి మసకబారడం లేదా స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలను ఎదుర్కొంటారు. అదేవిధంగా, రక్తాన్ని పంప్ చేయడానికి గుండెపై విపరీతమైన భారం పడుతుంది. ఇది గుండె కండరాలను బలహీనపరిచి, అకస్మాత్తుగా గుండెపోటు వచ్చేలా చేస్తుంది. సకాలంలో స్పందించకపోతే ఈ నష్టం శాశ్వతంగా మిగిలిపోయే అవకాశం ఉంది. అవయవాల వైఫల్యం.. అధిక రక్తపోటు కేవలం గుండె, మెదడుకే పరిమితం కాదు. ఇది మూత్రపిండాలలోని చిన్న రక్తనాళాలను దెబ్బతీస్తుంది, దీనివల్ల కిడ్నీలు ఫిల్ట్రేషన్ ప్రక్రియను నిలిపివేసి మూత్రపిండాల వైఫల్యానికి దారితీస్తాయి. అలాగే కళ్ళలోని నరాలు దెబ్బతినడం వల్ల అకస్మాత్తుగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. అందుకే అధిక రక్తపోటును 'సైలెంట్ కిల్లర్' అని పిలుస్తారు. బయటకు ఎలాంటి తీవ్రమైన లక్షణాలు కనిపించకపోయినా, లోపల అవయవాలు క్షీణిస్తూ ఉండవచ్చు. ముఖ్యంగా బీపీ 200 దాటినప్పుడు శరీరం ఇచ్చే ప్రతి హెచ్చరికను గమనించడం ముఖ్యం. అత్యవసర సమయంలో ఏం చేయాలి? ఒకవేళ మీ ఇంట్లో ఎవరికైనా రక్తపోటు 200 లేదా అంతకంటే ఎక్కువ నమోదైతే, వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించాలి. సొంతంగా మందులు వేసుకోవడం లేదా ఇంటి చిట్కాలు పాటించడం వంటి పొరపాట్లు అస్సలు చేయవద్దు. బాధితుడిని ప్రశాంతంగా ఉంచడానికి ప్రయత్నించండి ఎక్కువ కదలికలు లేకుండా చూడండి. తక్షణ వైద్య సహాయం అందడం వల్ల రక్తపోటును క్రమంగా తగ్గించి అవయవాలు దెబ్బతినకుండా కాపాడవచ్చు. సాధారణ రక్త పరీక్షలు, క్రమం తప్పకుండా బీపీ చెక్ చేసుకోవడం ద్వారా ఇటువంటి అత్యవసర పరిస్థితులు రాకుండా నివారించవచ్చు.

# ఆహారపు అలవాట్లు ఆరోగ్యాన్ని శాసిస్తాయా..!

ఆధునిక జీవనశైలిలో ఫాస్ట్ ఫుడ్ సంస్కృతి పెరిగిపోయిన తర్వాత రకరకాల ఆహారపు అలవాట్లు మన ఆరోగ్యాన్ని శాసిస్తున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా ఒక హాట్ డాగ్ తింటే మనిషి ఆయుష్షు 36 నిమిషాలు తగ్గుతుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా చక్కర్లు కొడుతోంది. వినడానికి ఇది కొంచెం ఆశ్చర్యంగా ఉన్నప్పటికీ మిచిగాన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు చేసిన ఒక లోతైన అధ్యయనం ఈ సంచలన విషయాలను వెల్లడించింది. మన నోటికి రుచిగా అనిపించే జంక్?ఫుడ్? మన శరీరంలోని అంతర్గత వ్యవస్థను ఎలా దెబ్బతీస్తాయో తాజా పరిశోధన స్పష్టం చేస్తోంది. కేవలం భయం పుట్టించడం కోసమే కాకుండా మనం తీసుకునే ఆహారం పట్ల అవగాహన పెంచడానికి ఈ గణాంకాలు ఎంతగానో తోడ్పడతాయి. నేచర్ ఫుడ్ పత్రికలో ప్రచురితమైన ఈ పరిశోధన ప్రకారం హాట్ డాగ్స్, బేకన్ ఇంకా సాసేజ్ వంటి ప్రాసెస్ చేసిన మాంసాలు ఆరోగ్యానికి అత్యంత హానికరమని తేలింది. కోసం సోడియం అంటే ఉప్పును, రకరకాల కొవ్వులను ఇంకా కొన్ని రకాల రసాయనాలను అధిక మొత్తంలో ఉపయోగిస్తారు. ఇవి రక్తపోటును పెంచడమే కాకుండా గుండె జబ్బులు, క్యాన్సర్ ఇంకా మధుమేహం వంటి ప్రాణాంతక వ్యాధుల ముప్పును వేగవంతం చేస్తాయి.



# ఏ నూనె ఆరోగ్యానికి మంచిది...?



మన వంటకాల్లో నూనె వాడకం రుచిని పెంచినప్పటికీ, అది మోతాదు మించితే ఆరోగ్యానికి ముప్పుగా మారుతుంది. ఐసీఎంఆర్ మార్గదర్శకాల ప్రకారం ఒక వ్యక్తి రోజుకు 20 మిల్లీలీటర్లకు మించి నూనె వాడకూడదు. ముఖ్యంగా మరిగించిన నూనెను పదే పదే వాడటం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

రిఫైన్డ్ నూనెల కంటే గానుగ నూనెలు శ్రేయస్కరమని, విభిన్న రకాల నూనెలను మారుస్తూ వాడటం వల్ల గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వారు సూచిస్తున్నారు. సరైన మోతాదు, నాణ్యమైన నూనె ఎంపికే ఆరోగ్యానికి రక్షణ కవచం. మన భారతీయ వంటకాల్లో నూనె అనేది విడదీయలేని భాగం. ఉదయం టిఫిన్ నుండి రాత్రి భోజనం వరకు ప్రతి దశలోనూ నూనెను విరివిగా ఉపయోగిస్తాం. అయితే, రుచి కోసం మనం వాడుతున్న అధిక నూనె మన ప్రాణాల మీదకు తెచ్చే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మారుతున్న జీవనశైలి కారణంగా దేశంలో ఒక్కో వ్యక్తి ఏడాదికి సగటున 23.5 లీటర్ల నూనెను వాడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

# కొబ్బరినీరు తెగ తాగేస్తున్నారా...?



దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్న వేళ, దాహార్తిని తీర్చుకోవడానికి ప్రతి ఒక్కరూ ప్రకృతి సిద్ధమైన పానీయాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ క్రమంలో కొబ్బరి నీరు వేసవిలో అత్యంత ప్రాచుర్యం పొందిన సూపర్‌డ్రింక్ గా మారింది.

సహజ ఎలక్ట్రోలైట్స్, శరీరానికి తక్షణ శక్తినిచ్చే గుణాలు ఉండటంతో ఫిట్‌నెస్ ప్రేమికుల నుండి సామాన్యుల వరకు అందరూ దీనిని అమృతంలా భావిస్తారు. చక్కెరతో కూడిన సాఫ్ట్ డ్రింక్స్‌కు ప్రత్యామ్నాయంగా ఇది అత్యుత్తమ ఎంపిక అనడంలో సందేహం లేదు. కొబ్బరి నీటిలో సుమారు 95 శాతం నీటితో పాటు పొటాషియం, సోడియం, మెగ్నీషియం వంటి ఎలక్ట్రోలైట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి చెమట ద్వారా కోల్పోయిన ద్రవాలను భర్తీ చేయడానికి సహాయ పడతాయి. అయితే, అతిగా తాగడం వల్ల రక్తంలో పొటాషియం స్థాయిలు విపరీతంగా పెరిగి 'హైపర్‌కలేమియా' అనే పరిస్థితి ఏర్ప డుతుంది. దీనివల్ల కండరాల బలహీనత, గుండె కొట్టుకోవడంలో వేగం తగ్గడం లేదా పెరగడం వంటి అసమానతలు తలెత్తుతాయి. తీవ్రమైన సందర్భాల్లో ఇది గుండెపోటుకు కూడా దారితీయవచ్చు.

అందుకే కొబ్బరి నీటిని మితంగా తీసుకోవడం ప్రాణావసరం. ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఊఖ) ప్రకారం, సాధారణ మంచి నీరే ప్రాథమిక హైడ్రేషన్ మూలంగా ఉండాలి తప్ప, కేవలం ఎలక్ట్రోలైట్ పానీయాలపైనే ఆధారపడకూడదు. అయితే, సహజ సిద్ధమైనది కదా అని అమితంగా కొబ్బరి నీరు తాగడం వల్ల ఊహించని ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.


# రుక్మిణి వసంత్ పారితోషికం తెలిస్తే షాక్ అవ్వాల్సిందే..!



దక్షిణాది యువ కథానాయిక రుక్మిణి వసంత్ ప్రస్తుతం వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. తాజాగా యష్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'టాక్సిక్' చిత్రంలో ఆమె కీలక పాత్రలో నటించారు. గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక 'టాక్సిక్' సినిమా కోసం రుక్మిణి వసంత్‌కు సుమారు రూ.3 కోట్ల పారితోషికం అందినట్లు తెలుస్తోంది. ఇటీవల ఆమె నటనకు మంచి గుర్తింపు రావడంతో రుక్మిణి వసంత్ మార్కెట్ కూడా గణనీయంగా పెరిగినట్లు తెలుస్తోంది. దీంతో దక్షిణాది చిత్ర పరిశ్రమలో అత్యంత డిమాండ్ ఉన్న యువ కథానాయికల్లో ఆమె ఒకరిగా నిలుస్తున్నారు. 'టాక్సిక్'లో యష్‌తో పాటు నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ బ్యానర్లపై వెంకట్ కె. నారాయణ, యాష్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్ర ట్రైలర్ ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. భారీ తారాగణం, గ్రాండ్ విజువల్స్‌తో తెరకెక్కిన 'టాక్సిక్' ప్రేక్షకుల అంచనాలను ఎంతవరకు అందుకుంటుందో చూడాలి.

# ఓటీటీలో దుమ్మురేపుతున్న క్రైమ్ థ్రిల్లర్

కొంతమంది ప్రేక్షకులు థ్రిల్లర్ జోనర్ వెబ్ సిరీస్‌లను ఎంతో ఆసక్తిగా వీక్షిస్తుంటారు. అలాంటి వారి కోసం తాజాగా అమెజాన్ ప్రైమ్ వీడియో ఓ వెబ్ సిరీస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం ఈ సిరీస్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇంతకీ ఆ వెబ్ సిరీస్ ఏంటంటే.. 'వదంది సీజన్ 2 (వదంది:ది మిస్టరీ ఆఫ్ మణి)'. ఇందులో శశికుమార్ ప్రధాన పాత్రలో నటించగా.. అపర్ణా దాస్, అనఘ, వివేక్ ప్రసన్న తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. ఆండ్రూ లూయిస్ దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌ను పుష్కర్–గాయత్రి నిర్మించారు. ఈ వెబ్ సిరీస్ కథ విషయానికి వస్తే.. ప్రభుత్వం ఓ హైవే నిర్మాణ పనులను ప్రారంభిస్తుంది. ఆ పనుల శంకుస్థాపన రోజే రెండు అస్తిపంజరాలు బయటపడతాయి. ఆ తర్వాత ఈ కేసు శశికుమార్ వద్దకు వస్తుంది. ఇంతకి బయటపడిన ఆ రెండు అస్తిపంజరాలు ఎవరివి? అసలు వారిని చంపింది ఎవరు? ఎందుకు హత్య చేశారు? అనే ఆసక్తికరమైన ప్రశ్నల చుట్టూ కథ సాగుతుంది. గ్రిప్పింగ్ స్క్రీన్‌ప్లేతో ఆసక్తికరంగా సాగే ఈ వెబ్ సిరీస్‌లో మొత్తం ఎనిమిది ఎపిసోడ్‌లు ఉన్నాయి. ఒక్కో ఎపిసోడ్ సుమారు 40 నిమిషాల నిడివితో ఉంటుంది. అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవుతున్న ఈ వెబ్ సిరీస్.. క్రైమ్ థ్రిల్లర్స్‌ను ఇష్టపడే వారికి మంచి ఆప్షన్ అని చెప్పవచ్చు.



# మానసిక ప్రశాంతత కోసం అలా చేశా : మమిత బైజు



ఈ మధ్యకాలంలో సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వాలని ఆసక్తి ఉన్నవారు ముందుగా సోషల్ మీడియాలో మంచి క్రేజ్ సంపాదించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సోషల్ మీడియాలో పాపులారిటీ వస్తే సినిమాల్లో అవకాశాలు దక్కిన సందర్భాలు చాలానే ఉండటంతో.. చాలా మంది ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. అలాగే కొత్తగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన బ్యూటీలతో పాటు సీనియర్ హీరోయిన్లు కూడా సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ అప్పుడప్పుడు తమ అందచందాలతో అభిమానులను ఆకట్టుకుంటున్నారు. సినిమాల్లో అవకాశాలు రావాలన్నా, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని కెరీర్‌లో మంచి స్థాయికి చేరుకోవాలన్నా.. ప్రస్తుతం సోషల్ మీడియా కూడా కీలకంగా మారిపోయింది. అలాంటి సమయంలో యంగ్ బ్యూటీ మమిత బైజు మాత్రం సోషల్ మీడియాకు దూరంగా ఉండనున్నట్లు ప్రకటించింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. కొన్ని రోజుల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపింది. ప్రస్తుతం తాను మానసిక ప్రశాంతతను కోరుకుంటున్నానని, అందుకే సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు చెప్పుకొచ్చింది. యంగ్ హీరోయిన్లు చాలామంది సోషల్ మీడియాలో తమ అందచందాలను ప్రదర్శిస్తూ ఫ్యాన్ ఫాలోయింగ్‌ను పెంచుకుంటున్న సమయంలో.. మమత బైజు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలనే నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యం కలిగిస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు. మరికొందరు మాత్రం మమిత బైజు ఈ విషయంలో ధైర్యమైన నిర్ణయం తీసుకుందని, ఆమె రూటే సపరేట్ అంటూ కామెంట్లు చేస్తున్నారు.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1,
Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com